

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 31-05-2025 | సంపుటి - 24 | సంచిక - 28 | రూ : 4 | పేజీలు: 8


## 2025: ప్రపంచ సుందరి ఎవరో?




- నేడు హైటెక్స్ వేదికగా మిస్ వరల్డ్ ఫైనల్
- టాప్-40లో మిస్ ఇండియా నందిని గుప్తా
- భారీ ఏర్పాట్లు.. బాలీవుడ్ తారల ప్రదర్శనలు

**మే 30, హైదరాబాద్ :** ప్రపంచ సుందరి 2025 ఎవరో తేలే సమయం ఆసన్నమైంది. విశిష్ట అతిథులు.. బాలీవుడ్ తారల ప్రదర్శనల నడుమ హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా శనివారం మిస్‌వరల్డ్ పోటీల ఫైనల్ జరగనుంది. కిరీటాన్ని సొంతం చేసుకునేందుకు 108 దేశాల అందాలభామలు పోటీపడుతున్నారు. మిస్ ఇండియా నందిని గుప్తా సహా 16 మంది సుందరీమణులు ఇప్పటికే టాప్ 40కి చేరుకున్నారు. మరో 24 మందిని న్యాయనిర్ణేతలు

తరువాయి 2లో

## సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో నేరగాళ్లను పట్టించే ఏఐ కెమెరాలు

- 'ఫేషియల్ రికగ్నిషన్' ఏర్పాటుకు సన్నాహాలు
- దేశవ్యాప్తంగా ఏడు స్టేషన్ల ఎంపిక

హైదరాబాద్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ముఖ కవళికలను గుర్తించి నేరగాళ్లను పట్టించే 'ఫేషియల్ రికగ్నిషన్ కెమెరా'లను రైల్వేశాఖ ఏర్పాటు చేయనుంది. దేశంలో పైలట్ ప్రాజెక్టు కింద హౌరా, సెల్దా, ఢిల్లీ, ముంబయి, ధనపూర్, చెన్నైలతో పాటు సికింద్రాబాద్‌నూ రైల్వే ఎంపిక చేసింది.

తరువాయి 2లో



## ప్రైవేటు రంగం ఆర్‌అండ్‌డీపై దృష్టి సారించాలి



- రక్షణ శాఖ కార్యదర్శి డాక్టర్ సంజీవ్ కుమార్
- తేజస్ మార్క్1ఏ మధ్యభాగం తొలి ఆర్డర్‌ను హెచ్ఏఎల్‌కు అందజేసిన వెమ్ టెక్నాలజీస్

హైదరాబాద్: హైదరాబాద్ రక్షణ పరిజ్ఞానాలకు కేంద్ర బిందువుగా అవతరిస్తోందని రక్షణశాఖ (ప్రొడక్షన్) కార్యదర్శి డాక్టర్ సంజీవ్‌కుమార్ అన్నారు. ప్రైవేటు సంస్థలు పరిశోధనల అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ)పై దృష్టి పెట్టాలని కోరారు. హైదరాబాద్ తుక్కుగూడలోని వెమ్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ ప్రాంగణంలో తేలికపాటి యుద్ధ విమానం తేజస్ మార్క్ 1ఏకి మధ్యభాగాన్ని తయారుచేసి తొలి ఆర్డర్‌ను హెచ్ఏఎల్‌కు శుక్రవారం అందజేశారు. కార్యక్రమ ముఖ్యఅతిథి సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎల్‌సీఏ తేజస్ ఎంకే 1ఏ ఉత్పత్తిని వేగవంతం చేయడంలో హెచ్ఏఎల్, వెమ్ టెక్నాలజీస్ భాగస్వామ్యాన్ని అభినందించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో తోడ్పాటు అందించుకోవాలన్నారు.

తరువాయి 2లో



## యుద్ధ విరమణకు ప్రాధేయపడిన పాక్

- తీవ్రవాద విషసర్పం పడగ విప్పితే కాలరాస్తాం
- పాకిస్థాన్‌కు మోదీ హెచ్చరిక

**మే 30, సమయం న్యూస్ :** కారాకాట్ (బిహార్)/కాన్పుర్: 'ఆపరేషన్ సిందూర్'లో పాకిస్థాన్ సైన్యాన్ని భారత్ మోకాళ్లపై నిలబెట్టిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇది మన దేశ సైన్యం సత్తాకు ప్రతీక అని తెలిపారు. తీవ్రవాద సర్పం మళ్లీ పడగవిప్పితే అది ఏ పుట్టలో ఉన్నా బయటకు లాగి కాలరాస్తామని హెచ్చరించారు. యుద్ధం ఆపాలంటూ పాక్ ప్రాధేయపడిందన్న మోదీ ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని

తరువాయి 2లో

## అసలు పోటీ ఇప్పుడే

- అమెరికా, చైనాలను ఢీకొట్టాలంటే భారత్ ప్రపంచస్థాయి ఉత్పత్తులు తయారుచేయాలి
- చిన్న ఆలోచనలు పక్కనపెట్టి ప్రపంచ దృష్టితో పనిచేయాలి
- అమరావతిలో గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ ఏర్పాటు చేయబోతున్నాం
- పారిశ్రామికవేత్తలకు ఏపీలో పుష్కలంగా అవకాశాలు
- సీఐఐ వార్షిక సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు




2లో




## వెబ్‌సైట్‌లో మెగా డీఎస్సీ హాల్‌టికెట్లు

- మొదట టీజీటీ.. చివర్లో ఎస్జీటీలకు పరీక్షలు
- రోజుకు రెండు విడతలుగా నిర్వహణ
- పీజీటీ, ప్రిన్సిపల్, పీడీలకు ఉదయం పూటే పరీక్షలు



2లో

## పార్టీలో పదేళ్లు ఎంతో ఆవేదన అనుభవించా

- నా లేఖను బహిర్గతం చేసినవారికి అది అంతర్గత అంశమని తెలియదా?
- కొత్త పార్టీ పెట్టే ఆలోచన లేదు
- భాజపాతో జతకట్టే పార్టీలకు భవిష్యత్తు ఉండదు: ఎమ్మెల్సీ కవిత



**మే 30, సమయం న్యూస్ , మంచిర్యాల:** భాజపాతో జతకట్టే పార్టీలకు రాజకీయంగా కొంతకాలం కలిసి వస్తుందేమో కానీ దీర్ఘకాలిక భవిష్యత్తు ఉండదని.. ఆ తర్వాత మరుగున పడటం ఖాయమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభిప్రాయపడ్డారు. ఇదే విషయాన్ని తాను కేసీఆర్‌కు చెప్పానన్నారు. పార్టీలో పదేళ్లుగా ఎన్నో ఆవేదనలను అనుభవించానని చెప్పారు. శుక్రవారం వివిధ ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంచిర్యాలకు వచ్చిన ఆమె మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు.తెలంగాణను సాధించిన పార్టీని

తరువాయి 2లో

## కాళేశ్వరం నివేదిక వచ్చాక.. అన్నీ బయటపెడతాం

- అవినీతిపరులకు, భూ బకాసురులకు శిక్ష తప్పదు
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో మంత్రి పొంగులేటి
- కవిత సమస్య టీకప్పులో తుపాను లాంటిదని వ్యాఖ్య

హైదరాబాద్: ''కాళేశ్వరం బ్యారేజీలపై ఎన్డీఎస్ఏ, విజిలెన్స్‌లు ఇప్పటికే నివేదికలిచ్చాయి. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక అందాల్సి ఉంది. భూముల వ్యవహారంలో ఫోరెన్సిక్ ఆడిటింగ్, విద్యుత్, సమాచార శాఖల్లోని భారాస అక్రమాలన్నీ కలిపి 99

తరువాయి 2లో



## సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో

# నేరగాళ్లను పట్టించే ఏఐ కెమెరాలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుతం రూ.720 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పనులతోపాటు ఫేషియల్ రికగ్నిషన్ వ్యవస్థ కూడా ఏర్పాటు కానుంది.

**ఇలా పని చేస్తుంది**

నేరాల దర్యాప్తులో నేరగాళ్ల కదలికలు అత్యంత కీలకం. నేరం చేసినవారు, నేరచరిత్ర ఉన్నవారు రైల్వేస్టేషన్ల ద్వారా పారిపోయేందుకు ప్రయత్నిస్తే వారిని గుర్తించి పట్టుకునేందుకు ఈ ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలు ఉపయోగపడతాయి. ఇటీవల జరిగిన కుంభమేళాలో ఇలాంటి కెమెరాలను వాడి పలువురు అనుమానితులను ముందస్తుగానే గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ ఫేషియల్ రికగ్నిషన్ వ్యవస్థను రైల్వేస్టేషన్లలో ఏర్పాటు చేయాలని భావించిన రైల్వేశాఖ.. దీనికి అవసరమైన డేటాబేస్ నిల్వ కోసం ఇప్పటికే దిల్లీలో రూ.18 కోట్లతో సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్(సి4)ను నిర్మించింది. అనుమానితులు, నేరగాళ్ల చిత్రాలను ఈ డేటాబేస్‌లో నిక్షిప్తపరుస్తారు. ఏఐ కెమెరాలు వాటి పరిధిలోకి వచ్చిన నేరగాళ్లను వారి ముఖ కవళికలను బట్టి గుర్తించి వెంటనే సమీప పోలీసులకు సమాచారం పంపిస్తాయి. ఇదంతా కృత్రిమమేధ(ఏఐ) ద్వారా జరుగుతుంది. బెంగళూరు రైల్వేస్టేషన్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ విధానం ద్వారా 90 రోజుల వ్యవధిలో 47 మంది అనుమానితులను పట్టుకున్నారు. ఈ వ్యవస్థ ఎంత సమర్థంగా పనిచేస్తుందంటే నేరస్థులు ముఖానికి మాస్కు ధరించినా ముఖ కవళికలను గుర్తించి పట్టేస్తుంది.

# అసలు పోటీ ఇప్పుడే

దిల్లీ: ''ప్రస్తుతం దేశానికి సరైన సమయంలో సరైన నాయకుడు నరేంద్ర మోదీ ఉన్నారు. ఆయన నాయకత్వం భారత్‌కు సానుకూలంగా మారింది. పదేళ్ల క్రితం ఆర్థికంగా పదో స్థానంలో ఉన్న మనం ఇప్పుడు నాలుగో స్థానానికి వచ్చాం. మరో రెండేళ్లలో మూడోస్థానానికి చేరతాం. ఇప్పటివరకూ పెద్ద ప్రయాస లేకుండానే ఇక్కడివరకు వచ్చాం. ఇప్పుడు నిజమైన పోటీ ప్రారంభమవుతుంది. ఆర్థిక పరిమాణంలో ఇండియాచైనా మధ్య నాలుగున్నర రెట్లు, ఇండియాఅమెరికా మధ్య ఏడు రెట్ల తేడా ఉంది. దీన్ని అధిగమించడానికి పారిశ్రామికరంగం సంసిద్ధం కావాలి. ఈ కీలక సమయంలో ప్రభుత్వం మంచి విధానాలు తెచ్చి, పారిశ్రామికరంగం కష్టపడి పనిచేస్తే భారత్‌ను ఎవ్వరూ కొట్టలేరు. ఐటీ కంపెనీల విషయంలో భారత్ అద్భుతంగా పనిచేస్తున్నా.. మనం ప్రపంచస్థాయి నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఉత్పత్తులను తయారుచేయడంలో బలహీనంగా ఉన్నాం. మనకు అదే ఇప్పుడు పెద్ద సవాల్. ఆ లోటును అధిగమించాలి'' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం దిల్లీలో జరిగిన భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) వార్షిక సదస్సులో ఆయన మాట్లాడారు. గత మూడు దశాబ్దాల్లో పరిణామాలను వివరిస్తూ రాబోయే మార్పుల గురించి చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి రావాలని ఆహ్వానించారు. 'భారత్ గురించి చెప్పే ప్రతి సందర్భంలో నేను ఆంధ్రప్రదేశ్‌ను ప్రమోట్ చేయడం గురించి ఆలోచిస్తా. ఇదివరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్‌లో అత్యుత్తమ ఎకోసిస్టం సృష్టించగలిగాం. విభజన తర్వాత అది తెలంగాణకు వెళ్లింది. ఇప్పుడు తెలంగాణ ఆదాయంలో 75% హైదరాబాద్ నుంచే వస్తోంది. అందుకే తెలంగాణ ఇప్పుడు దేశంలో అత్యధిక తలసరి ఆదాయ రాష్ట్రంగా అవతరించింది. ఇదంతా గత 25 ఏళ్లలోనే సాధ్యమైంది. ఇప్పుడు దేవుడు నాకు అమరావతి రూపంలో మరో నగరం నిర్మించే అవకాశం ఇచ్చాడు. ఇక్కడ చాలా అవకాశాలున్నాయి.

* మనం అభివృద్ధి చెందిన దేశంగా అవతరించడం ఖాయం. అయితే మధ్య ఆదాయ ఉచ్చులో ఇరుక్కోకూడదు. ఇక్కడున్న పారిశ్రామికవేత్తలు 10 20 ఏళ్లలో ఎంతో ఎత్తుకు ఎదిగారు. అలాగే నా రాష్ట్ర ప్రజలకు నేనెందుకు చేయకూడదన్న సంకల్పంతో పనిచేస్తున్నా.
* 90లలో ఐటీని ప్రోత్సహించాను. ఇప్పుడు ఏఐతో క్వాంటం కంప్యూటింగ్‌ను ప్రోత్సహిస్తున్నాం. టీసీఎస్, ఐబీఎం, ఎల్అండ్‌టీల సంయుక్త ఆధ్వర్యంలో వచ్చే జనవరికి అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీ ఏర్పాటుచేస్తున్నాం. మీ వ్యాపారాల ఉత్తమ ఫలితాల కోసం దీన్ని ఉపయోగించుకోవాలని ఆహ్వానిస్తున్నా.
* రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకుంటే అన్ని అనుమతులూ ఇచ్చి రికార్డు టైంలో దాన్ని అమల్లోకి తెచ్చేందుకు నేను బాధ్యత తీసుకుంటున్నాను. హరిత ఇంధనం, పోర్టులు రాష్ట్రానికి ఉన్న పెద్ద సానుకూలత.
* రాయలసీమలో లేపాక్షిఓర్వకల్లు మధ్య హైటెక్నాలజీ హబ్ ఏర్పాటు చేయబోతున్నాం. ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ ఇండస్ట్రీని ఇక్కడ ప్రోత్సహిస్తున్నాం. గత ఏడాది కాలంలో రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు, 4.5 లక్షల ఉద్యోగాల కల్పనకు వేదిక సిద్ధం చేశాం.
* ప్రపంచవ్యాప్తంగా సరకు రవాణా వ్యయం 8% ఉంటే భారత్‌లో అది 14% దాకా ఉంది. ఈ భారాన్ని తగ్గించడానికి పోర్టులు, ఎయిర్‌పోర్టులు, జాతీయ రహదారులు, రైల్వే లైన్లను అనుసంధానం చేస్తున్నాం.
* 90లలో మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఎవరూ ముందుకు రాకపోవడంతో పీపీపీ విధానం ప్రవేశపెట్టాం. దానివల్ల దేశంలో తొలి ప్రైవేటు విద్యుత్తు కేంద్రం జేగురుపాడులో, తొలి ప్రైవేటు విమానాశ్రయం హైదరాబాద్‌లో వచ్చాయి. తర్వాత టెలికాం, పోర్టులు, రోడ్లు వచ్చాయి. అదే సమయంలో ఆదాయ అంతరాలు పెరిగాయి. దాన్ని తగ్గించడానికి పీ4 విధానం తీసుకొచ్చాం.
* నేను మధ్య తరగతి కుటుంబంలో పుట్టాను. నా తండ్రి రైతు అని గర్వంగా చెప్పుకోగలను. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని ముందుకెళ్లాను. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ కూడా చిన్న కుటుంబంలోనే జన్మించారు. బరోడా రాజు ఆయనకు బాంబేలో చదువుకొనేందుకు చేయూతనిచ్చారు. తర్వాత లండన్‌లో చదువుకోవడానికీ సాయం చేశారు. ఆ సాయం లేకున్నా ఆయన గొప్పవారయ్యేవారు. కానీ ఆ సాయం ఆయనకు తన కెరీర్‌ను పెద్దగా మలుచుకోవడానికి ఉపయోగపడింది. అబ్దుల్ కలాంకి ఒక అయ్యర్ సాయం చేశారు. సరైన సమయంలో చేసే చిన్న సాయమైనా పెద్ద తేడాను చూపుతుంది. అందుకే అత్యధిక సంపద ఉన్న తొలి 10%మంది చిట్టచివర ఉన్న 20%మందిని దత్తత తీసుకోవాలని పిలుపునిస్తున్నా. నేను మీ డబ్బంతా ఇచ్చేయాలని అడగను. సామాజిక బాధ్యతనే గుర్తుచేస్తున్నా.
* ప్రపంచానికి సేవలు అందించే లీడర్లను తయారుచేయాలి. అందుకే అమరావతిలో గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ ఏర్పాటుచేస్తాం. ఇప్పుడు ప్రపంచ పారిశ్రామికవేత్తలను కలవడానికి దావోస్ వెళ్తున్నట్లే ప్రపంచం అమరావతిలోని గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్‌కు రావాలన్నది లక్ష్యం.
* 1995లో ఏపీ వ్యవసాయాధారిత రాష్ట్రం. ఆ సమయంలో రాష్ట్రాన్ని పారిశ్రామికంగా మార్చే ఉద్దేశంతో నేను ఎక్కడికెళ్లినా 2030 మందిని వెంట తీసుకెళ్లేవాడిని. వారు విదేశీ పారిశ్రామికవేత్తలతో మాట్లాడేవారు. దానివల్ల ఐదేళ్లలోనే ఆంధ్రా పారిశ్రామికవేత్తలు శక్తిమంతంగా తయారయ్యారు. ఆంత్రప్రెన్యూర్స్ కాస్తా ఆంధ్రప్రెన్యూర్స్‌గా మారారు. ఇప్పుడు భారతదేశం పారిశ్రామికవేత్తలకు ప్రత్యామ్నాయ పేరుగా మారాలన్నది లక్ష్యం.
* మీరంతా సమీప భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌లో కనీసం ఒక వ్యాపారమైనా ప్రారంభించాలి. సీఐఐకి నేను ఎన్నో చేశాను కాబట్టి మిమ్మల్ని మా రాష్ట్రంలో పెట్టుబడి పెట్టాలని కోరే హక్కు నాకుంది' అని అన్నారు.

## పార్టీలో పదేళ్లు ఎంతో ఆవేదన అనుభవించా

(మొదటిపేజీ తరువాయి)

గుండెల్లో పెట్టుకొని కాపాడుకోవాలనేది తన తాపత్రయం తప్పితే కొత్త పార్టీ పెట్టాలనే ఆలోచన లేదని స్పష్టంచేశారు. 'ఏవైనా సమస్యలుంటే పార్టీలో అంతర్గతంగా చర్చించుకోవాలని.. గీతదాటొద్దని కొంతమంది అంటున్నారు. మరి నేను రాసిన లేఖ అంతర్గతమే కదా.. దాన్ని బయటపెట్టింది ఎవరు?' అని ప్రశ్నించారు. కేసీఆర్ భోజనం చేసే సమయంలోనూ ప్రజాసమస్యలపైనే చర్చిస్తారు తప్ప కుటుంబానికి, వ్యక్తిగత అంశాలకు తావీయరని.. అందుకే లేఖలు రాస్తానని కవిత చెప్పారు. ''భవిష్యత్తులో ఏం జరుగుతుందో.. 20 ఏళ్ల ముందే పసిగట్టగలను. ఎంపీగా ఉన్నప్పుడే బీసీల రిజర్వేషన్లు, మహిళా బిల్లు అంశాలను పార్లమెంటు వేదికగా లేవనెత్తాలని కేసీఆర్ దృష్టికి తీసుకొచ్చా. అప్పుడు పట్టించుకోలేదు. ఇప్పుడేమైంది.. నేను ఆలోచించినట్లుగానే జరుగుతోంది కదా.. ఒకవేళ నేను చెప్పినట్లుగా ఆనాడే రాజకీయ విధానాన్ని ప్రకటించి ఉంటే ఆ పేరు భారాసకు వచ్చేది. సింగరేణిలో, పార్టీలో కొత్త నాయకత్వానికి అవకాశం కల్పించాలని చెప్పినా పట్టించుకోలేదు. చెప్పి లాభం లేదనుకొని తెలంగాణ జాగృతిలో కొత్తతరానికి అవకాశం కల్పించాం. పార్టీని కాపాడుకోవాలనే తాపత్రయంతోనే ముందుకు వెళ్తున్నా.. నాపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారని అనుకోవడం లేదు. లిక్కర్ స్కాంలో నన్ను ఇరికించే ప్రయత్నం చేశారు. నేను నిర్దోషిని. నా లేఖతో కాంగ్రెస్, భాజపాలకు రాజకీయంగా ఎలాంటి మేలు జరగదు'' అని కవిత పేర్కొన్నారు.

**కాబోయే ఎమ్మెల్యే..**

శ్రీరాంపూర్ నుంచి కారులో వస్తున్న జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్, జగిత్యాలకు చెందిన వసంతను 'కాబోయే ఎమ్మెల్యే' అని కవిత వ్యాఖ్యానించారు. భారాస నుంచా లేక కొత్త పార్టీ తరఫునా అని మీడియా ప్రశ్నించగా.. పక్కా భారాస నుంచే అని స్పష్టంచేశారు. ఆమె పర్యటనలో భారాస సభ్యులెవరూ పాల్గొనలేదు.

**మానవత్వం లేని పార్టీ భాజపా**

భాజపా మానవత్వం లేని పార్టీ అని.. ఆపరేషన్ కగార్ పేరిట మారణకాండ సృష్టించిందని కవిత మండిపడ్డారు. మంచిర్యాలలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన జర్నలిస్ట్ మునీర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ఆమె అక్కడే మీడియాతో మాట్లాడారు. నంబాల కేశవరావు సహా ఇతర మావోయిస్టు నేతల్ని కాల్చిచంపి.. మృతదేహాలను సైతం కుటుంబీకులకు ఇవ్వలేదని మండిపడ్డారు. సరస్వతి పుష్కరాల్లో పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణకు ప్రొటోకాల్ పాటించకపోవటం, గతంలో యాదాద్రిలో ఉపముఖ్యమంత్రి భట్టికి అవమానం ఘటనలతో కులప్రభావం ఎక్కువగా ఉన్నట్లు బయటపడిందన్నారు. కాంగ్రెస్, భాజపా విధానాలను ఖండించాలన్నారు.

## వెబ్‌సైట్‌లో మెగా డీఎస్సీ హాల్‌టికెట్లు

అమరావతి: మెగా డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలను జూన్ 6 నుంచి జులై 6 వరకు నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన నెట్ లాంటి కొన్ని పరీక్షలు ఉన్నందున మధ్యలో ఒక ఐదారు రోజులు పరీక్షలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. శుక్రవారం రాత్రి నుంచి ఆన్‌లైన్ ద్వారా హాల్‌టికెట్లను అందుబాటులోకి తెచ్చారు. కూటమి ప్రభుత్వం 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించిన సంగతి తెలిసిందే. రాష్ట్రానికి చెందిన వారితోపాటు ఇతర రాష్ట్రాల అభ్యర్థులు కలిపి మొత్తం 3,35,401 మంది ఈ పరీక్షకు దరఖాస్తు చేశారు. దీంతో రాష్ట్రంతోపాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశాల్లోనూ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. దరఖాస్తు సమయంలోనే పరీక్ష కేంద్రాలకు సంబంధించి ఐచ్ఛికాలు స్వీకరించారు. ఎక్కువ మందికి వీటి ప్రకారమే పరీక్ష కేంద్రాలను కేటాయించారు.

**మొదట టీజీటీ.. చివరికి ఎస్జీటీ**

* ఆన్‌లైన్ పరీక్షలను మొదట ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ (టీజీటీ) అభ్యర్థులకు నిర్వహిస్తారు. ఆ తర్వాత స్కూల్ అసిస్టెంట్లకు, అనంతరం పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లకు ఉంటాయి. చివరిగా సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)లకు నిర్వహిస్తారు. చదువుకునేందుకు కొంత సమయం కావాలని, ఎస్జీటీలకు చివరిగా పరీక్షలు నిర్వహించాలని అభ్యర్థులు కోరినందున ఈ మేరకు చర్యలు తీసుకున్నారు.
* డీఎస్సీ పరీక్షలను రోజూ రెండు విడతలుగా నిర్వహిస్తారు. ఉదయం 9.30 నుంచి 12, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉంటాయి.
* ప్రిన్సిపల్, పీజీటీ, పీడీ పోస్టులకు పరీక్ష మూడు గంటలపాటు ఉంటుంది. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తారు.
* టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపల్ అభ్యర్థులకు ఆంగ్ల భాష నైపుణ్య పరీక్ష ఉంటుంది. దీని కాలవ్యవధి గంటన్నర.

**అదనపు సమయం ఇవ్వలేం**

జిల్లాకో ప్రశ్నపత్రం, 90 రోజుల అదనపు సమయం కావాలన్న అభ్యర్థనలకు ప్రభుత్వం వివరణ ఇచ్చింది. గతేడాది నవంబరులోనే డీఎస్సీ సిలబస్‌ను ఆన్‌లైన్‌లో ఉంచామని, దీంతో అభ్యర్థులు పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఆరు నెలల కంటే ఎక్కువ సమయం లభించిందని పేర్కొంది. 90 రోజుల సమయం ఇస్తే విద్యా సంవత్సరం మధ్యలో వారు ఉద్యోగాల్లో చేరాల్సి వస్తుందని, ఇది విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ప్రభావం చూపుతుందని వెల్లడించింది. డీఎస్సీ పారదర్శకంగా, లోపరహితంగా నిర్వహించేందుకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష మంచిదని, పేపర్ లీకేజీలు ఉండవని తెలిపింది. ఫలితాలను నార్మలైజేషన్ చేస్తారని, ఈ విధానాన్ని న్యాయస్థానాలు సైతం సమర్థించాయని వివరించింది.

## ప్రైవేటు రంగం ఆర్‌అండ్‌డీపై దృష్టి సారించాలి

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్ రక్షణ పరిజ్ఞానాలకు కేంద్ర బిందువుగా అవతరిస్తోందని రక్షణశాఖ(ప్రొడక్షన్) కార్యదర్శి డాక్టర్ సంజీవ్‌కుమార్ అన్నారు. ప్రైవేటు సంస్థలు పరిశోధనల అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ)పై దృష్టి పెట్టాలని కోరారు. హైదరాబాద్ తుక్కుగూడలోని వెమ్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ ప్రాంగణంలో తేలికపాటి యుద్ధ విమానం తేజస్ మార్క్ 1ఏకి మధ్యభాగాన్ని తయారుచేసి తొలి ఆర్డర్‌ను హెచ్‌ఏఎల్‌కు శుక్రవారం అందజేశారు. కార్యక్రమ ముఖ్యఅతిథి సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎల్‌సీఏ తేజస్ ఎంకే1ఏ ఉత్పత్తిని వేగవంతం చేయడంలో హెచ్‌ఏఎల్, వెమ్ టెక్నాలజీస్ భాగస్వామ్యాన్ని అభినందించారు.

## 2025: ప్రపంచ సుందరి ఎవరో?

(మొదటిపేజీ తరువాయి)

శనివారం ఎంపిక చేయనున్నారు. పలు దఫాల వడబోత అనంతరం చివరి దశలో అమెరికాకరేబియన్, ఆఫ్రికా, యూరప్, ఆసియాఓషియానా ఖండాల నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేస్తారు. ఈ నలుగురిలో తుది ప్రశ్న ద్వారా మిస్‌వరల్డ్‌ను ప్రకటిస్తారు. మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పిజ్కోవా 72వ ప్రపంచ సుందరికి కిరీటాన్ని ధరింపజేస్తారు. ఫైనల్‌కు వేదికైన హైటెక్స్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్తు కాంతులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

ప్రముఖ నటుడు సోనూసూద్‌కు మిస్‌వరల్డ్ హ్యూమానిటేరియన్ అవార్డును అందజేయనున్నారు.

**న్యాయ నిర్ణేతలు వీరే**

* జ్యూరీ హెడ్: మిస్ వరల్డ్ ఛైర్‌పర్సన్ జూలియా మోర్లే
* జ్యూరీ సభ్యులు: సోనూసూద్(నటుడు), సుధారెడ్డి(ఆంత్రప్రెన్యూర్) కెరినా టిర్రెల్(2014 మిస్ ఇంగ్లాండ్)
* హాజరయ్యే ప్రముఖులు: మానుషి చిల్లర్ (2017 మిస్ వరల్డ్)
* 2016 మిస్‌వరల్డ్ స్టెఫాని డెల్, ప్రజెంటర్ సచిన్ కుంభార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. బాలీవుడ్ స్టార్లు జాక్వెలిన్ ఫెర్నాండెజ్, ఇషాన్ ఖట్టర్‌లు ప్రదర్శనలతో అలరించనున్నారు.

**ఆరుసార్లు మన సొంతం..**

మిస్‌వరల్డ్ పోటీలు 1951లో ప్రారంభం కాగా మనదేశం మూడోసారి ఆతిథ్యమిస్తోంది. గతంలో బెంగళూరు(1996), ముంబయి(2024)లో జరిగాయి. ప్రపంచసుందరి కిరీటాన్ని మన దేశ భామలు ఆరుసార్లు సొంతం చేసుకున్నారు. రీటా ఫారియా(1966), ఐశ్వర్యారాయ్ (1994), డయానా హెడెన్(1997), యుక్తాముఖి(1999), ప్రియాంక చోప్రా(2000), మానుషి చిల్లర్(2017) కిరీటాన్ని దక్కించుకున్నారు. 1952లో అతితక్కువగా 11 దేశాల భామలు మాత్రమే పోటీపడగా 2013లో అత్యధికంగా 127 దేశాలకు చెందిన అతివలు పోటీపడ్డారు.

**మిస్‌వరల్డ్ గ్లోబల్ అంబాసిడర్‌గా సుధారెడ్డి**

మేఘా(ఎంఈఐఎల్) సంస్థ డైరెక్టర్ సుధారెడ్డిని మిస్‌వరల్డ్ సంస్థ గ్లోబల్ అంబాసిడర్‌గా నియమించినట్లు సంస్థ ఛైర్‌పర్సన్ జూలియో మోర్లే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## యుద్ధ విరమణకు ప్రాధేయపడిన పాక్

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. శుక్రవారం బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో ఆయన పర్యటించారు. అక్కడ రూ.వేల కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. బిహార్‌లోని కరాకట్‌లో జరిగిన ఓ ర్యాలీని ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ ''పహల్గాం దురాగతానికి పాల్పడినవారికి వారు కలలో కూడా ఊహించని శిక్ష విధిస్తామని ఆనాడు హామీ ఇచ్చాను. ఇచ్చిన హామీని నెరవేర్చి మళ్లీ బిహార్‌కు వచ్చాను'' అని చెప్పారు. భారతీయ మహిళల సిందూరానికున్న శక్తి ఏమిటో పాకిస్థాన్‌కు, యావత్ ప్రపంచానికీ తెలిసివచ్చిందని అన్నారు. ''పాకిస్థాన్ సైన్యాన్ని దాని మోకాళ్లపై నిలబెట్టాం. ఆ దేశ వైమానిక స్థావరాలను, సైనిక సదుపాయాలను ధ్వంసం చేశాం. ఇదే నవభారతం. దీని శక్తిని అందరూ చూస్తున్నారు'' అని చెప్పారు. జమ్మూ కశ్మీర్‌లో పోరాడుతూ అసువులు బాసిన సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) సబ్ ఇన్‌స్పెక్టర్ మొహమ్మద్ ఇంతియాజ్ పేరును ప్రధాని తన ప్రసంగంలో ప్రస్తావించారు. 2014లో ఎన్‌డీఏ ప్రభుత్వం కేంద్రంలో అధికారానికి వచ్చాక నక్సల్ సమస్య పరిష్కారానికి ప్రాధాన్యతనిచ్చిందన్నారు. దీంతో నక్సల్ ప్రభావిత జిల్లాల సంఖ్య 125 నుంచి 18కి తగ్గిపోయాయన్నారు. బిహార్‌లో ఆర్జేడీపై మోదీ విమర్శలు గుప్పించారు. ''దశాబ్దాలుగా ప్రజలకు మరుగుదొడ్లు కూడా అందుబాటులో లేవు. బ్యాంకు ఖాతాలూ లేవు. కోట్లాది మందికి పక్కా గృహాలే లేవు. ఆర్జేడీ, కాంగ్రెస్‌లు మాట్లాడే సామాజిక న్యాయం ఇదేనా'' అని ప్రశ్నించారు.

**బ్రహ్మోస్‌తో విధ్వంసం**

కాన్పుర్ ర్యాలీలో మోదీ మాట్లాడుతూ.. ''పాకిస్థాన్‌లో వందల కిలోమీటర్ల లోపల ఉన్న తీవ్రవాద స్థావరాలను మట్టుబెట్టాం. భారత ఆయుధాలు, బ్రహ్మోస్ క్షిపణులు పాక్‌లో విధ్వంసం సృష్టించాయి, దీంతో యుద్ధం ఆపాల్సిందిగా పాకిస్థాన్ ప్రాధేయపడింది. ఆపరేషన్ సిందూర్ దేశీయ ఆయుధాల సత్తాను నిరూపించింది'' అని అన్నారు. కాన్పుర్ పర్యటన సందర్భంగా పహల్గాం ఉగ్రదాడిలో మృతిచెందిన శుభం ద్వివేది కుటుంబాన్ని చకేరి విమానాశ్రయంలో మోదీ కలిశారు. ఈ కలయిక సందర్భంగా భావోద్వేగ పూరిత వాతావరణం నెలకొందని శుభం ద్వివేది బంధువు సౌరభ్ ద్వివేది అన్నారు.

## కాళేశ్వరం నివేదిక వచ్చాక... అన్నీ బయటపెడతాం

(మొదటిపేజీ తరువాయి)

అయ్యాయి. శిశుపాలుడి తప్పుల్లా కాళేశ్వరం రిపోర్టు వచ్చే సరికి వందో తప్పు అవుతుంది. ఇక చర్యలు తీసుకోవడమే మిగిలింది. నివేదికలపై మంత్రిమండలిలో చర్చించి కఠిన చర్యలు తీసుకుంటాం'' అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ వాటిపై కసరత్తు చేస్తున్నారన్నారు. శుక్రవారం హైదరాబాద్ సచివాలయంలోని రెవెన్యూశాఖ కార్యాలయంలో మీడియాతో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

**దయ్యాలెవరో కవితే బయటపెట్టాలి**

''భారాస, భాజపాల మధ్య మంచి దోస్తానా ఉందని కల్వకుంట్ల కవిత, భాజపా ఎమ్మెల్యేలే స్పష్టంగా చెప్పారు. కవితను కేసీఆర్ నుంచి ఎవరు దూరం చేస్తున్నారో, దయ్యాలు ఎవరో ఆమెనే చెప్పాలి. ఆమె చేసిన వ్యాఖ్యల్లో మిశ్రమ అర్థాలున్నాయి. కవిత సమస్య టీకప్పులో తుపాను లాంటిది. కవిత కాంగ్రెస్‌లోకి వచ్చే అంశంపై మాట్లాడేంత పెద్ద నాయకుడిని కాదు. భారాసను భాజపాలో విలీనం చేస్తారని ఆమె స్వయంగా వ్యాఖ్యానించారు. మా ఇంటికి ఏనాడూ ఈడీ అధికారులు రాలేదు. మా కూతురు ఇంటికి వెళ్లారు. నాకన్నా కేటీఆర్‌కే ఈడీ గురించి ఎక్కువ తెలుసు. వచ్చే మూడున్నరేళ్ల కాలం రేవంత్‌రెడ్డినే సీఎంగా ఉంటారు. కాళేశ్వరంలోని మేడిగడ్డ బ్యారేజీని బాంబులతో పేల్చేశారన్న కేటీఆర్ వ్యాఖ్యలు... తప్పు చేసి దొరికిపోయి దబాయిస్తున్నట్లుగా ఉంది. ఎల్‌అండ్‌టీ క్లీన్‌చిట్ ఇచ్చిందంటూ ఆయన చెప్పుకొంటున్నారు. అసలు ప్రధాన నిందితుల్లో ఎల్‌అండ్‌టీ ఒకటి. దాన్ని ఎవరు నడిపించారో తెలియదా? బ్యారేజీ భారాస అధికారంలో ఉన్నప్పుడే కూలింది. పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బాంబులు పెట్టి ఉంటే కాంగ్రెస్ నాయకులని అప్పుడే ఎందుకు అరెస్టు చేయలేదు? ఇసుకపై బ్యారేజీలు కట్టారు. భారాస ప్రభుత్వంలో కూలింది కాబట్టి సరిపోయింది. లేదంటే నింద మాపై మోపేవారు. కాళేశ్వరం కమిషన్‌ను మేం నడిపిస్తే మొదటి నిందితుడిగా కేసీఆర్‌నే పిలిచేవాళ్లం.

**ఎసైన్డ్ భూములపై హక్కుల కల్పన**

రాష్ట్రంలో పేదల చేతుల్లో ఉన్న ఎసైన్డ్ భూములకు హక్కులు కల్పిస్తాం. వాటిని ఎవరైనా కొనుంటే, వారు పేదలైతే వారికే హక్కులిస్తాం. పెద్దల చేతుల్లో ఉన్న భూములను మాత్రం వెనక్కి తీసుకుంటాం. భూభారతిని పైలట్ కింద అమలు చేసిన మండలాల్లో వచ్చిన దరఖాస్తుల్లో 39% సాదాబైనామా సమస్యలున్నాయి. కోర్టు స్టే తొలగిపోయాక అర్హతలున్న దరఖాస్తులను పరిష్కరిస్తాం.

# నా కూతురికి పునర్జన్మ ప్రసాదించిన భద్రాచలం , చర్ల వైద్యులకు ఏమిచ్చిన రుణం తీర్చుకోలేనూ

* **గిరిజన యువతి కి ప్రాణదానం చేసిన భద్రాచలం ఏరియా ఆసుపత్రి సిబ్బంది**



భద్రాచలం,చర్ల ఆసుపత్రుల వైద్య సిబ్బందిని అభినందించిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ , ఐటీడీఏ పీ ఓ రాహుల్ ,డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు. ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రెండు నెలల పాటు భద్రాచలం ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో చికిత్స అందించి పురుగుల మందును సేవించిన ఒక మహిళకు భద్రాచలం ఆసుపత్రి సిబ్బంది ప్రాణం పోశారు. వివరాల్లోకెళ్తే, చర్ల మండలం లక్ష్మీ కాలనీకి చెందిన 22 ఏళ్ల మడకం శిరీష అనే మహిళ మోనోక్రోటోఫోస్ అనే పురుగుల మందును రెండు నెలల క్రితం ఏప్రిల్ ఒకటవ తేదీన త్రాగి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ చర్లకు వెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి, కడుపులో ఉన్న పురుగుల మందును కొంత బయటకు తీశారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. విషపూరితమైన మోనోక్రోటోఫోస్ పురుగుల మందు అప్పటికే ఊపిరితిత్తులపై కొంత ప్రభావం చూపించగా కోన ఊపిరి తో ఉన్న ఆమెను ఊపిరి తిత్తుల వైద్యులు డాక్టర్ జగదీష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది రెండు నెలల పాటు వెంటలేటర్ పై చికిత్స అందించి ఆ మహిళ ప్రాణాన్ని నిలబెట్టారు. ఆమెను డిస్చార్జ్ చేసే క్రమంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు ఆసుపత్రిని సందర్శించి ఆమెకు చికిత్స చేసిన డాక్టర్ జగదీష్ , ఇతర వైద్య సిబ్బందిని అభినందించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ భద్రాచలం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ ను అభినందించారు. రెండు నెలలు కష్టపడి వెంటిలేటర్ పై ఉన్న మహిళకు ఊపిరి పోసినందుకు భద్రాచలం వైద్య సిబ్బందిని ,వెంటనే స్పందించి ప్రాథమిక చికిత్స చేసినందుకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ చర్ల వైద్య సిబ్బందిని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్,ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ , జిల్లా ఆసుపత్రుల ప్రధాన పర్యవేక్షణ అధికారి డాక్టర్ రవిబాబు అభినందించారు. ఇదే స్ఫూర్తితో రోగుల పట్ల అంకిత భావంతో సేవలందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

**ఆనందభాష్పాలతో కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు**

రెండు నెలలు రేయింబవళ్లు ఎంతో ఓపికతో చికిత్స చేసి తన బిడ్డను కంటికి రెప్పలా కాపాడిన భద్రాచలం వైద్య సిబ్బందికి శిరీష తండ్రి రమేష్ ధన్యవాదాలు తెలియజేశారు. " నా కూతురికి పునర్జన్మ ప్రసాదించిన భద్రాచలం , చర్ల వైద్యులకు, వైద్య సిబ్బందికి ఏమిచ్చిన రుణం తీర్చుకోలేనూ " అని ఆనందభాష్పాలతో తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

## టీజేయు నూతన కార్యాలయం ప్రారంభం



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : గాజులరామారం డివిజన్ పరిధిలోని శ్రీవెన్ ఎనక్లేవ్ కాలనీలో పాత్రికేయుల హక్కుల పరిరక్షణ, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ వస్తున్న తెలంగాణ జర్నలిస్టుల యూనియన్ (టీజేయు), నూతన కార్యాలయాన్ని శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ జర్నలిస్టుల యూనియన్ నూతన కార్యాలయం నియోజకవర్గ జర్నలిస్టులకు ఒక కేంద్రబిందువని , సమాచార మార్పిడికి, సమస్యల పరిష్కారానికి , కార్యకలాపాల సక్రమ నిర్వహణకు ఎంతో ఉపయోగపడనుందన్నారు. టీజేయు ఆశయాలు, లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లే దిశగా ఇది కీలకమైన పాత్ర పోషిస్తుందన్నారు.. ఈ కార్యాలయం జర్నలిస్టుల మద్దతుకు, యూనియన్ కార్యకలాపాలకు, సమావేశాలకు, సమావేశ స్థలంగా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీజేయు రాష్ట్ర అధ్యక్షులు కప్పరా ప్రసాద్ రావు, ఆదాబ్ హైదరాబాద్ దినపత్రిక ఎడిటర్ వి. సత్యం గౌడ్,ఐఎఫ్డబ్ల్యుజే జాతీయ ఉపాధ్యక్షుడు పెద్దాపురం నర్సింహా, ఐఎఫ్డబ్ల్యుజే జాతీయ కార్యదర్శి భరత్ కుమార్ శర్మ, కార్యదర్శి బింగి స్వామి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు జి.వి. రామకృష్ణ, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పల్లపు శ్రీనివాస్, ఎంఎన్. చారి, కిషోర్ చారి, సూర్య, రాము, కోటేశ్వర్ రావు, మహేష్, పర్వేజ్, రమేష్, వెంకటేష్,రజని, నాగమణి, స్థానిక నాయకులు పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రామి రెడ్డి, తెలంగాణ సాయి తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి నగర్ ప్రజలకు ఒక ఆహ్లాదకరమైన పర్యావరణ వనరుగా అభివృద్ధి చేస్తాం

* **ఎమ్మెల్యేలు కె.పి.వివేకానంద్, అరికెపూడి గాంధీ లు**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : అంబీర్ చెరువును ప్రగతి నగర్ ప్రజలకు ఒక ఆహ్లాదకరమైన పర్యావరణ వనరుగా అభివృద్ధి చేస్తామని బి.ఆర్.ఎస్. పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ లు అన్నారు. శుక్రవారం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ లోని అంబీర్ చెరువును అభివృద్ధి , పరిరక్షణ పనులపై సమీక్ష కోసం బి.ఆర్.ఎస్.పార్టీ విప్ ఎమ్మెల్యే కె. పి. వివేకానంద్ , శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సంబంధిత శాఖా అధికారులు , స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రానున్న వర్షాకాలం లోపే నిర్మాణం పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.రూ.90 లక్షలతో రూపొందించిన పనుల ప్రణాళికను త్వరగా చేపట్టాలన్నారు. ప్రగతి నగర్ నుండి వచ్చే మురికి నీటిని అంబీర్ చెరువులో కలవకుండా డైవర్షన్ చేసి శంషిగూడ ఔట్ లెట్ లో కలిపి చెరువును కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. చెరువు నీటి నిల్వ సామర్థ్యం, శుభ్రత, ఫుట్ పాత్, వాకింగ్ ట్రాక్ వంటి అభివృద్ధి అంశాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ప్రభుత్వం తరపున అవసరమైన నిధులు, అనుమతుల కోసం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ అలీ, ఇరిగేషన్ శాఖ డి.ఈ.ఈ. నరేంద్ర, ఏ.ఈ.ఈ. లక్ష్మీనారాయణ, కార్పొరేషన్ బి.ఆర్.ఎస్. పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ గాజుల సుజాత, నాయకులు సాంబశివా రెడ్డి, స్టాలిన్ రెడ్డి, శ్రీకర్ గుప్తా, అర్పిత ప్రకాష్, శిల్పా , స్థానికులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర మేధావుల ఫోరం రాష్ట ఉపాధ్యక్షురాలుగా గుండ్రెడ్డి రమాదేవి



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : జాతీయ బిసి మహిళ సంక్షేమ కన్వీనర్, బిసి జాతీయ మహిళా ఉత్తమకారిణి గుండ్రెడ్డి రమాదేవి ని తెలంగాణ ఇంటలెక్చన్స్ ఫోరం (తెలంగాణ మేధావుల ఫోరం) రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా ఎంపిక చేసినట్టు తెలంగాణ మేధావులు ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ తెలిపారు. ఫోరం కార్యవర్గ సమావేశంలో ఎంపిక చేసినట్లు తెలిపారు. రమాదేవి క్రీడలలో ఎన్నో బహుమతులు గెలిచారు. ఉస్మానియా యూనివర్సిటీ నుండి ఏంఏ, ఎంఫిల్ పూర్తి చేసి పి హెచ్డి చేస్తున్నారు. రమాదేవి క్రీడలలో ఎన్నో అవార్డులు బహుమతులు గెలుచుకున్నారు. త్రోబల్, జోడులలో విద్యార్థులకు ఎన్నో క్రీడా శిక్షణ తరగతులు నిర్వహించారు. గత 25 సంవత్సరాలుగా బీసీ సంక్షేమ సంఘం ఉద్యమకారునిగా సేవలందిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న సమయంలో రాష్ట్ర బీసీ మహిళ సంక్షేమ సంఘం అధ్యక్షురాలుగా, మహిళా హక్కులు, మహిళ సాధికారత, మహిళ రిజర్వేషన్లు అంశాలపై జాతీయస్థాయిలో అనేక పోరాటాలు చేశారు. భరతనాట్యంలో మంచి కళాకారునిగా అనేక అవార్డులు అందుకున్నారు. రమాదేవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గా విధులు నిర్వహిస్తూ మహిళలకు ఉచిత ఉపాధి, శిక్షణ తరగతులు నిర్వహించి ఉత్తమ పారిశ్రామికవేత్తగా అనేక సంస్థల ద్వారా ఎన్నో పురస్కారాలు పొందారు. తెలంగాణ రాష్ట్రంలో అనేక మహిళా సంస్థలకు మార్గదర్శకాలుగా ఉండి వారి సంక్షేమ, అభివృద్ధి కొరకు నిరంతరం సేవలందిస్తున్నారు. శాంతి, పర్యావరణ పరిరక్షణ, మహిళా హక్కులపై ఎన్నో సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవికి వివిధ విద్యార్థి, యువజన,మహిళా, విద్యావేత్తలు డాక్టర్లు, ఇంజనీర్లు సంఘాలు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ తనకు ఇచ్చిన ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి, ముందుండి నిరుపేదలకు సేవలు అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ మేధావులు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజు నారాయణ ముదిరాజ్ కు, కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.



## సమిష్టి కృషితో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుకుందాం

* **ప్రజలకు కనీస మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతర కృషి**
* **కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**
* **ఉమ్మడి చుంచుపల్లి జిపిలో రూ.3.58కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారం, సమిష్టి కృషితో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుకుందామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని చుంచుపల్లి మండలం విద్యానగర్, వెంకటేశ్వర కాలనీ, రామాంజనేయ కాలనీ, ఎన్ కె నగర్, నంద తండా గ్రామపంచాయతీల పరిధిలో రూ.3.58కోట్ల ఈజీఎస్, సబ్ ప్లాన్ నిధులతో చేపట్టనున్న రోడ్లు డ్రైనేజి పనులకు శంకుస్థాపన, పూర్తయిన పనులకు ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిని శంకుస్థాపన, ప్రారంభోత్సవ సభల్లో కూనంనేని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజావసరాలను గుర్తించి నిధుల మంజూరుకు కృషి జరుగుతోందని ప్రాధాన్యత క్రమంలో పనులను పూర్తిచేస్తున్నామని తెలిపారు. ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించామని, కనీస అవసరాలైన త్రాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీలు వంటి వాటికి ప్రాధాన్యత కల్పిస్తున్నామని, ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు చేరవేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి అధికారులతోపాటు, ప్రజలు దృష్టి సారించాలని, నాణ్యతతో పనులు జరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడివో శుభాషిణి, ఎమ్మార్వో కృష్ణ, వివిధ శాఖల అధికారులు, సత్యనారాయణ, నాగేందర్, రాయల వెంకటేశ్వర్లు, రవి, నర్సింహారావు, గుప్తా, వసంత, శ్రీనివాసరెడ్డి, రమేష్ సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి, నాయకులు పొలమూరి శ్రీను, జక్రయ్య, భాగం మహేశ్వరరావు, భాగం మాధవరావు, రాంజీ, పౌల్, శ్రీనివాసరెడ్డి, బిక్కసాని నాగేశ్వర్రావు, నాని, అజయ్, బషీర్, యాకూబి, రతన్, వేదాద్రి, యాంద్ర మహేష్, నగేష్, , జమలయ్య, కృష్ణయ్య, రాజేష్, వీరు, కొండా ప్రసాద్, సూరమ్మ, కిట్టు, పిడుగు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

* **కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్నగర్ డివిజన్ పరిధిలోని సుభాష్ నగర్ లో తమిళయన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ బాల మురుగన్ కుమారస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మంగళ నాధ్యం, విగ్నేశ్వరా పూజ, గణపతి హోమం, రుద్ర హోమం, అస్త్ర హోమం తో పాటు శివ నాగ దేవతుల విగ్రహ ప్రతిష్టపన తదితర పూజ కార్యక్రమాలు వేద పండితుల మంత్రోశ్చరణలతో నిర్వహించారు. ఈ వేడుకలకు బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ లు హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తమిళయన్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి. కొటస్వామి, వైస్ ప్రెసిడెంట్ ఆర్.గణేశన్, జనరల్ సెక్రటరీ కె. చిన్న స్వామి,ట్రెజరర్ టి.భాస్కర్, జాయింట్ సెక్రటరీ ఎస్ ఆనందం , తమిళయన్స్ అసోసియేషన్ తో పాటు రాజకీయ నాయకులు, సుభాష్ నగర్ డివిజన్ ముఖ్య నాయకులు , ప్రముఖులు , స్థానికులు మహిళలు , భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 17మంది మావోయిస్టుల లొంగుబాటు

* **వారిలో ఆరుగురు మహిళలు ఛత్తీస్ గఢ్ రాష్ట్రానికి చెందినవారే**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఆపరేషన్ కగార్ ముమ్మరంగా కొనసాగుతున్న వేళ శుక్రవారం తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో 17మంది మావోయిస్టులు ఎస్పీ రోహిత్ రాజుఎదుట లొంగిపోయారు. వీరిలో ఆరుగురు మహిళలు కూడా ఉన్నారు. వారంతా ఛత్తీస్ గఢ్ రాష్ట్రం బీజాపూర్, సుక్మా జిల్లాలకు చెందిన మావోయిస్టులుగా పోలీసులుగుర్తించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులకు వసతులు కల్పిస్తామని, వారి భవిష్యత్తుకు పూర్తి హామీ ఇస్తున్నామని ప్రకటించారు.ఈ సమావేశంలో కొత్తగూడెం అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ జి.నరేందర్,భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ,141 బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ ప్రీతా,81 బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ రవిశర్మ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,చర్ల సీఐ రాజు వర్మ, ఆర్ఐ ఆపరేషన్స్ రవి తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపార పెట్టుబడి నిమిత్తం చెక్ ను అందజేత




జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : హెల్పింగ్ హార్ట్ సొసైటీ ఫౌండర్ టి విజయ్ కుమార్ కుమార్తె టి సాత్విక పదవ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఓ వికలాంగుడికి వ్యాపార పెట్టుబడి నిమిత్తం చెక్ ను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండర్ టి విజయ్ కుమార్ మాట్లాడుతూ తన కుమార్తె పుట్టినరోజుని పురస్కరించుకొనిఈ విధంగా ఒక మంచి ఉపయోగకరమైన పనికి తన వంతుగా చిన్న కృషిని చేయడం తన మనసుకి హాయిగా మరి ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికి తన హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. మనం చేయగలిగిన పనులు సమాజంలో చేయడానికి చాలా ఉంటాయి అని దాదాపు మనం చేస్తే లేదా చేయడానికి ప్రయత్నిస్తే కనీసం కొంతైనా సమాజానికి సేవ చేసిన వారిగా ఉంటామని తెలిపారు ఈ కార్యక్రమం లో బేబీ సాత్విక బర్త్డే కేక్ ని కట్ చేసి చాలా సంతోషంగా సందడి చేశారు.ఈ కార్యక్రమంలో నగేష్ , దేవి, సాజిత్ , వీరేందర్ సింగ్ రాథోడ్, ఝూన్సీ, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ రాష్ట మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్స్ లో తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్యుఐ విద్యార్థి నాయకుడు సాయికుమార్ పంతుల మున్సిపల్ గ్రౌండ్స్ లో నివసించే చిన్నారులతో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర శక్తిని ఐటీ ద్వారా ప్రపంచానికి పరిచయం చేస్తూ పారిశ్రామిక అభివృద్ధికి పునాది వేస్తూ, జనహితమే ధ్యేయంగా ప్రజాసేవ చేస్తున్న రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్, పరిశ్రమలు & వాణిజ్యం శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# వందేభారత్‌లో కాలం చెల్లిన కూల్ డ్రింక్స్.. కేరళ హెచ్ఆర్సీ నోటీసులు

తిరువనంతపురం: మంగళూరు తిరువనంతపురం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికులకు కాలం చెల్లిన శీతలపానీయాలు ఇచ్చారంటూ వచ్చిన ఆరోపణల నేపథ్యంలో కేరళ మానవ హక్కుల సంఘం సీరియస్‌గా స్పందించింది. ఈ ఘటనపై స్వయంగా కేసు నమోదు చేసింది. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేసి 15 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని పాలక్కాడ్‌లోని డివిజనల్ రైల్వే మేనేజర్‌కు నోటీసులు జారీ చేసినట్లు హెచ్ఆర్సీ ఓ ప్రకటనలో పేర్కొంది. రైలులో అందించే శీతల పానీయాల గడువు తేదీ దాటిపోయిందంటూ స్థానిక మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో ఈ తరహా చర్యలు చేపట్టింది. ఆ కూల్ డ్రింక్



బాటిళ్లపై తయారీ తేదీ గతేడాది సెప్టెంబర్ 25 ఉండగా.. ఎక్స్‌పైర్ డేట్ మాత్రం మార్చి 24, 2025గా ఉంది. అయితే, ప్రయాణికులు ఫిర్యాదు చేసినా.. క్యాటరింగ్ సిబ్బంది పట్టించుకోలేదంటూ ఆరోపణలు రావడంతో మానవహక్కుల కమిషన్ స్పందించి కేసు నమోదు చేసింది. ఈ కేసును జూన్ 26న విచారణ చేపట్టనుంది.

# సూర్యుడికి కులం, మతం ఉందా..?

## విద్యార్థులకు హీరో విజయ్ ప్రశ్న



కుల, మత అంశాలతో మనసును పాడుచేసుకోవద్దంటూ 'తమిళగ వెట్రి కళగం అధినేత, ప్రముఖ హీరో విజయ్ విద్యార్థులకు సూచించారు. వాటి ఆధారంగా విభజనను తోసిపుచ్చాలని కోరారు. 10, 12 తరగతుల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించిన అనంతరం ఆయన పలు సూచనలు చేశారు. ఈ ప్రకృతికి మతం, కులం ఉన్నాయా..? అని ప్రశ్నించారు. తమిళనాడు రాజధాని చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో విజయ్ మాట్లాడుతూ..'' ప్రజాస్వామ్యం అందరికీ సమాన అవకాశాలు ఇచ్చింది. ప్రజాస్వామిక విలువలను పాటించాలని మీ కుటుంబ సభ్యులకు చెప్పండి. అవినీతి కార్యకలాపాలకు దూరంగా ఉండే.. విశ్వసనీయత కలిగిన వ్యక్తులకు ఓటు వేయాలని కోరండి. కులం, మతం ఆధారంగా విభజనను తోసిపుచ్చండి. అలాంటి అంశాలతో మీ మనసు పాడు చేసుకోకండి. సూర్యుడు, వరణుడు.. వంటి వాటితో నెలవైన ప్రకృతికి ఆ భేదం ఉందా..? డ్రగ్స్‌ను దూరం పెట్టినట్టే కులం, మతం వంటి వాటినీ దరిచేరనీయొద్దు. ప్రజాస్వామ్యం ఉన్నప్పుడే.. ఈ ప్రపంచంలో స్వేచ్ఛ ఉంటుంది'' అని సూచించారు. విజయ్ పలు అంశాలపై తన అభిప్రాయాలను సూటిగా చెప్తుంటారన్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే.. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది జరగనున్నాయి. టీవీకేతో సహా ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నాయి. రాష్ట్రంలో విజయ్ అధికార డీఎంకేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. భాజపాపైనా విమర్శనాస్త్రాలను సంధిస్తున్నారు.

# ఒకే షిఫ్ట్‌లో నీట్ పీజీ పరీక్ష: సుప్రీం ఆదేశం



నీట్ పీజీ25 ప్రవేశ పరీక్ష విషయంలో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ ప్రవేశ పరీక్షను జూన్ 15న రెండు విడతల్లో నిర్వహించి, జులై 15న ఫలితాలు విడుదల చేస్తామని నేషనల్ ఎగ్జామినేషన్ బోర్డ్ ప్రకటించిన నేపథ్యంలో ఈ ఆదేశాలు వచ్చాయి. పరీక్షను రెండు విడతల్లో నిర్వహించడం వల్ల ప్రశ్నల క్లిష్టత స్థాయి మారి కొందరు విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉందని ఎన్ఈబీ నిర్ణయంపై ఆందోళన వ్యక్తమైంది. అందుకే దానిని ఒకేవిడతలో నిర్వహించేలా బోర్డ్‌ను ఆదేశించాలని కోరుతూ సుప్రీంలో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై విచారణ జరిపిన కోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. అయితే ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహణ కోసం కేంద్రాలు, సమయం సరిపోదంటూ ఎన్ఈబీ వినిపించిన వాదనను సుప్రీం తోసిపుచ్చింది. జూన్ 15న పరీక్ష నిర్వహణ కోసం ఏర్పాట్లు చేసేందుకు తగిన సమయం ఉందని వ్యాఖ్యానించింది.

# భారత్‌ను ఆపాలని పాక్ ప్రపంచ దేశాలను వేడుకుంది : రాజ్‌నాథ్ సింగ్




భారత నౌకాదళానికి చెందిన విమాన వాహకనౌక ఐఎన్ఎస్ విక్రాంత్ను శుక్రవారం కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన అక్కడి అధికారులతో మాట్లాడారు. అనంతరం ఆపరేషన్ సిందూర్ గురించి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'మన దేశం శక్తిమంతమైన దాడులు చేయడంతో భారత్‌ను ఆపాలని పాకిస్థాన్ ప్రపంచదేశాలను వేడుకుంది. మన నిబంధనల ప్రకారమే సైనిక చర్యలను ఆపేశాం. ఆపరేషన్ సమయంలో నేవీ పాత్ర అద్భుతమైనది. పాక్ గడ్డపై ఉన్న ఉగ్రవాద స్థావరాలను వైమానిక దళం నేలమట్టం చేసింది. అదే సమయంలో మన నావికాదళం సముద్రంలో చూపిన సంసిద్ధత పాక్ నావికాదళాన్ని ఎక్కడికీ కదలనీయకుండా చేసింది. మీ ముందస్తు మోహరింపుతో పాక్ ధైర్యంపై దెబ్బకొట్టారు. మీరు పాక్‌పై చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదు. మీ సన్నద్ధతే దాయాదికి గట్టి హెచ్చరిక. భారత నావికాదళ శక్తిని, సైనిక చర్యలను, సామర్థ్యాలను చూసి శత్రుదేశం భయాందోళనకు గురైంది' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని.. ఇచ్చింది విరామమేనని పేర్కొన్నారు. పాక్ మరో తప్పు చేస్తే ఈసారి కోలుకునే అవకాశమే లేకుండా గట్టిగా ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ ఆపరేషన్ సిందూర్ నిర్వహించి పాక్‌లోని ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే పాక్ ప్రతిస్పందనను నావికాదళం పసిగట్టి.. తమ సంసిద్ధతను గణనీయంగా పెంచడానికి పలు చర్యలు తీసుకుంది. పాక్‌లోని కరాచీ పోర్టు లక్ష్యంగా ఐఎన్ఎస్ విక్రాంత్, బ్రహ్మోస్ క్షిపణులతో కూడిన యుద్ధ నౌకలు, జలాంతర్గాములను మోహరించింది.

# 'ప్రత్యేక సేవలకు' నో చెప్పిందని.. 'అంకిత' హత్య కేసులో ఎన్నో మలుపులు!



కుటుంబానికి అండగా నిలవాలని రిసెప్షనిస్ట్‌గా చేరిన ఓ టీనేజ్ అమ్మాయి.. నెలరోజులకే విగతజీవిగా మారింది. అక్కడి నుంచి పోలీసుల అలసత్వం, రాజకీయ పలుకుబడి.. వీటిపై పెల్లుబికిన ప్రజాగ్రహం.. వెరసి తాజా కోర్టు తీర్పు.. ఇలా దాదాపు మూడేళ్లకు ఆ యువతి కుటుంబానికి న్యాయం దక్కింది. ఈ కేసులో పులకిత్ ఆర్య, సౌరభ్ భాస్కర్, అంకిత్ గుప్తాలను న్యాయస్థానం దోషులుగా తేల్చింది. ఎన్నో మలుపులు తిరిగిన ఉత్తరాఖండ్‌కు చెందిన అంకితా భండారీ కేసు అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.. వివరాల్లోకి వెళ్తే.. ఉత్తరాఖండ్‌లోని పౌడీ గఢ్వాల్ జిల్లాలో డోబ్‌శ్రీకోట్ గ్రామానికి చెందిన అంకితా భండారీ(19).. 2022 ఆగస్టులో రిషికేశ్ సమీపంలోని ఒక రిసార్ట్‌లో రిసెప్షనిస్ట్‌గా చేరింది. ఆ రిసార్ట్‌ను అప్పటి భాజపా సీనియర్ నేత వినోద్ ఆర్య కుమారుడు పులకిత్ ఆర్య నిర్వహిస్తున్నాడు. అక్కడ చేరిన నెల రోజులకే ఆమె కనిపించకుండా పోయింది. వీఐపీ గెస్ట్‌ల కోసం వ్యభిచారం చేయడానికి నిరాకరించడం ఆమె ప్రాణాల మీదకు తెచ్చింది. ఈ ప్రత్యేక సేవల విషయంలో పులకిత్‌తో పాటు ఇద్దరు సిబ్బంది సౌరభ్ భాస్కర్, అంకిత్ గుప్తా ఆమెపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. అది చివరకు ఘర్షణకు దారితీసింది. తర్వాత ఆమెను ఒక వాహనంలోకి బలవంతంగా ఎక్కించి, రిషికేష్ సమీపంలోని చిల్లా కెనాల్‌లో పడేశారు. తర్వాత ఏమీ తెలియనట్లు రిసార్ట్‌కు వచ్చేశారు. ఆమె స్నేహితుడు పుష్ప్ వల్లే ఈ ఘోరమంతా బయటపడింది. మరణానికి కొన్ని గంటల ముందు అంకిత అతడితో మాట్లాడింది. వారు చేసిన ఒత్తిడి గురించి చెప్పింది. అదే రోజు రాత్రి ఆమెకు ఫోన్ చేయగా.. స్విచ్ఛాఫ్ అని వచ్చింది. తర్వాత ఆర్య, ఇతర సిబ్బందికి ఆమె గురించి వాకబు చేయగా.. ఒక్కొక్కరు ఒక్కోలా సమాధానం చెప్పారు. తెల్లవారి నుంచి ఆర్య ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ అయింది. దాంతో ఆ స్నేహితుడిలో అనుమానం మొదలైంది. ఆ వెంటనే పుష్ప్, ఆమె కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. విచిత్రమేంటంటే.. అంకితను చంపిన వాడే మిస్సింగ్ ఫిర్యాదు ఇచ్చాడు. ఇక ఆమె ఆచూకీ గుర్తించాల్సిన పోలీసులు అలసత్వం ప్రదర్శించారు. ఆ రిసార్ట్ ఉన్న ప్రాంతం రెవెన్యూ పోలీస్ ఆఫీసర్ పరిధిలో ఉంటుంది. వారికి సాధారణ పోలీసుల్లా కాకుండా అధికారాలు, దర్యాప్తు సామర్థ్యాలు చాలా పరిమితంగా ఉంటాయి. దాంతో ఆమెను గుర్తించడం ఆలస్యమైంది. మృతురాలి కుటుంబం, స్నేహితుల నుంచి ఒత్తిడి రావడంతో మూడు రోజుల తర్వాత కేసును సాధారణ పోలీసులు అప్పగించారు. ఆ ఉదాసీనతను అప్పుడు డీజీపీగా ఉన్న అశోక్ కుమార్ కూడా అంగీకరించారు. ఇక ఆరు రోజులకు కెనాల్‌లో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. కాలువలో కొట్టుకుపోవడం వల్లే అంకిత మృతి చెందిందని, లైంగిక దాడి జరగలేదు కానీ.. శారీరకంగా టార్చర్ చేశారని పోస్ట్‌మార్టం నివేదికలో వెల్లడైంది. దాంతో స్థానికుల్లో ఆగ్రహ జ్వాలలు వ్యక్తమయ్యాయి. నిందితులను తీసుకెళ్లిన పోలీసు వ్యాన్‌పై దాడికి పాల్పడ్డారు. వారిని బయటకు లాగేందుకు యత్నించారు. రిసార్ట్‌పైనా దాడి చేశారు. నిందితులను కాపాడుతున్నారంటూ ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. అయితే ఆ రిసార్ట్‌ను అక్రమంగా నిర్మించారంటూ రాత్రికి రాత్రే దానిపైకి ప్రభుత్వం బుల్డోజర్‌ను పంపి కూల్చివేయించింది. వినోద్ ఆర్యను భాజపా బహిష్కరించింది. నిందితులు ఈ కేసును పుష్ప్‌మీదకు మళ్లించే ప్రయత్నాలు చేశారు. అంకిత అంత్యక్రియల సమయంలో అడ్డంకులు సృష్టించారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో కేసు సత్వర విచారణకు సీఎం పుష్కర్ సింగ్ ధామి హామీ ఇవ్వడంతో ఆందోళనలు చల్లారాయి. ఈ కేసులో మే 19న కోర్టులో తుది వాదనలు ముగియగా.. 30న తీర్పు వెలువడింది. పులకిత్, సౌరభ్, అంకిత్‌లను న్యాయస్థానం దోషులుగా తేల్చింది. అయితే, వినోద్ ఆర్య మాత్రం తన కుమారుడు ఏ తప్పూ చేయలేదని బహిరంగంగానే పలుమార్లు ప్రకటించారు. తన కుమారుడు అలాంటి నేర స్వభావం కలిగిన వ్యక్తి కాదని సమర్థించుకొచ్చారు. పులకిత్, అంకిత.. ఇద్దరికీ న్యాయం జరగాలంటూ ఆయన చేస్తున్న వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# బీఎస్ఎఫ్ దెబ్బకు.. పాక్ ఇప్పట్లో కోలుకోవడం కష్టమే!

*** అమిత్ షా**

పాకిస్థాన్ దుశ్చర్యలను దీటుగా తిప్పికొట్టిన భారత సరిహద్దు భద్రతా దళాలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసలు కురిపించారు. ఇటీవల చేపట్టిన సైనిక ఆపరేషన్ సమయంలో పాక్‌లోని 118 పోస్టులను మన దళాలు ధ్వంసం చేశాయని అన్నారు. వారి సమాచార, నిఘా నెట్‌వర్క్‌ను కూల్చివేశాయన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారిగా జమ్మూ కశ్మీర్‌లో పర్యటించిన ఆయన.. బీఎస్ఎఫ్ కొట్టిన దెబ్బకు శత్రుదేశం కోలుకునేందుకు ఏళ్లు పట్టే అవకాశం ఉందన్నారు. ''ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా మనం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిస్పందనగా పాకిస్థాన్ సైన్యం మన సరిహద్దులోని పౌరులపై దాడులు చేసింది. వీటిని మన బీఎస్ఎఫ్ దళాలు దీటుగా తిప్పికొట్టాయి.



దాదాపు 118 పాక్ పోస్టులను ధ్వంసం చేశాయి. శత్రువుల నిఘా వ్యవస్థను ఒక్కొక్కటిగా కూల్చివేశాయి. వాటిని పునరుద్ధరించేందుకు శత్రువులకు దాదాపు నాలుగు నుంచి ఐదేళ్లు పడుతుంది'' అని అమిత్ షా పేర్కొన్నారు. బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నుంచి తనకు అందించిన సమాచారం ప్రకారం.. పాక్ సైనిక సమాచార, నిఘా వ్యవస్థలకు భారీ దెబ్బ తగిలిందన్నారు. కొంతకాలం పూర్తి సమాచార ఆధారిత యుద్ధాన్ని చేసే పరిస్థితిలో వారు లేరన్నారు. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ సంసిద్ధతపై అమిత్ షా ప్రశంసలు కురిపించారు. అప్రమత్తంగా ఉంటూ స్పష్టమైన వ్యూహాలను విజయవంతంగా అమలు చేశారని కొనియాడారు. భారత సరిహద్దులో ఎటువంటి దాడులు జరిగినా మొదట ఆ భారాన్ని మోసేది బీఎస్ఎఫ్ జవాన్లేనని అన్నారు.

### త్వరలో ప్యాకేజీ..

జమ్మూ కశ్మీర్‌లో రెండు రోజుల పర్యటనలో భాగంగా.. ఇటీవల పాకిస్థాన్ జరిపిన దాడుల సందర్భంగా నష్టపోయిన కుటుంబాలను అమిత్ షా పరామర్శించారు. పాక్ దాడుల్లో దెబ్బతిన్న ఇళ్లు, వ్యాపార కేంద్రాలు, ప్రార్థనా మందిరాలకు సంబంధించిన పరిహార ప్యాకేజీని కేంద్రం త్వరలో ప్రకటిస్తుందన్నారు. పాక్ దాడుల్లో దెబ్బతిన్న పలు ప్రాంతాలను పరిశీలించిన ఆయన అక్కడి స్థానికులతో మాట్లాడారు.

# 'మంచితనానికి రోజుల్లేవ్'.. చైనాపై మరోసారి ట్రంప్ రుసరుస!

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై మరోసారి విరుచుకుపడ్డారు. ఇరు దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని డ్రాగన్ దేశం ఉల్లంఘించిందని ఆరోపించారు. 'అతి మంచితనం పనికి రాదు' అంటూ తన సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో ఓ పోస్ట్ పెట్టారు. ఇంతకీ ఏ విషయంలో చైనా ఒప్పందం ఉల్లంఘించిందనేది మాత్రం ఆయన వెల్లడించలేదు. కొన్ని వారాల క్రితం పోటాపోటీగా సుంకాల పోరుకు దిగిన ఇరు దేశాలూ.. తర్వాత వాణిజ్య చర్చల కోసం అంగీకారం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోసారి చైనాపై ట్రంప్ రుసరుసలాడడం ప్రాధాన్యం సంతరించుకుంది. ''రెండు వారాల క్రితం చైనా ఆర్థికంగా ప్రమాదంలో ఉంది. నేను విధించిన సుంకాల కారణంగా అమెరికాతో వ్యాపారం దాదాపు అసాధ్యం అనే పరిస్థితి నెలకొంది. దీంతో అక్కడి పరిస్థితులు దిగజారాయి. చాలా కర్మాగారాలు మూతబడ్డాయి. ఓ రకంగా పౌర అశాంతి నెలకొంది. సర్లే అని అక్కడి పరిస్థితులను చక్కదిద్దేందుకు చైనాతో త్వరితగతిన ఒప్పందం కుదుర్చుకున్నా. ఈ ఒప్పందం కారణంగా అక్కడ పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్నాయి.

# చైనా త్రీ గోర్జెస్ డ్యామ్‌కు సమానమైన ఇంజనీరింగ్ అద్భుతం కాళేశ్వరం

: కేటీఆర్

హైదరాబాద్: దృఢ నాయకత్వం, ప్రజల జీవితాలను మార్చాలన్న చిత్తశుద్ధి ఉంటే అద్భుతమైన ప్రగతి సాధ్యమని తెలంగాణ రాష్ట్రం నిరూపించిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తొమ్మిదేళ్ల భారాస పాలనలో తెలంగాణ సాధించిన విజయాలు దేశానికే కాదు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. సంపద సృష్టించడంతో పాటు సమాజంలోని అట్టడుగు వర్గాలకు



సమానంగా పంచడమే తమ హయాంలో తెలంగాణను దేశంలోనే ప్రత్యేకంగా నిలిపిందని వివరించారు. లండన్‌లో జరుగుతున్న బ్రిడ్జ్ ఇండియా వీక్ 2025 సదస్సులో.. 'స్థిరమైన వృద్ధితో ప్రపంచ ఆర్థిక రంగాన్ని నడిపించడంలో తెలంగాణ ఎందుకు ముఖ్యం?' అనే అంశంపై కేటీఆర్ ప్రధాన ఉపన్యాసం ఇచ్చారు. భారాస హయాంలో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో విప్లవాత్మక పంథాను అనుసరించి వివిధ రంగాల్లో తీసుకొచ్చిన మార్పులు, విధానాలపై తన అనుభవాలు, ఆలోచనలను పంచుకున్నారు. కేసీఆర్ నాయకత్వంలోని భారాస ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి మధ్య అద్భుత సమతుల్యత సాధించిందన్నారు. తమ హయాంలో పాలనను ప్రజలకు చేరువ చేయడంతో పాటు ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించి వ్యక్తుల కంటే విధానాలకే ప్రాధాన్యత ఇచ్చామన్నారు. విప్లవాత్మక మార్పులను ఆహ్వానించడంతో పాటు నిర్ణయాధికారాన్ని వికేంద్రీకరించడమే తెలంగాణను మిగతా రాష్ట్రాల కంటే ప్రత్యేకంగా మార్చిందని తెలిపారు. ఇంజనీరింగ్ అద్భుతంగా చెప్పుకొనే చైనాలోని త్రీ గోర్జెస్ డ్యామ్‌కు సరిసమానమైన ప్రాజెక్టు తెలంగాణలోని కాళేశ్వరం అని వివరించారు. ప్రతి సీజన్‌కు 45 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నామని... అన్ని రకాల అనుమతులను తీసుకొని, నిర్వాసితులకు సరైన పరిహారం ఇచ్చి కేవలం మూడేళ్లలోనే ప్రాజెక్టును పూర్తి చేసి దేశం మొత్తం నివ్వెరపోయేలా చేశామని పేర్కొన్నారు. కేసీఆర్ నేతృత్వంలో దేశంలోనే తొలిసారి కోటి ఇళ్లకు మిషన్ భగీరథతో సురక్షిత మంచినీటిని అందించినట్లు వివరించారు.




## హైదరాబాద్‌లో మరో భారీ మోసం.. జీడిమెట్లలో రూ.150 కోట్ల స్కామ్

జీడిమెట్ల: భాగ్యనగరంలో మరో భారీ మోసం వెలుగు చూసింది. స్టాక్‌మార్కెట్లో పెట్టుబడుల పేరుతో ఓ సంస్థ రూ.150 కోట్ల మేర శఠగోపం పెట్టింది. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతల్ గణేశ్‌నగర్‌లో కొందరు వ్యక్తులు 'ది పెంగ్విన్ సెక్యూరిటీస్' పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేశారు. స్టాక్‌మార్కెట్లో పెట్టుబడులు అంటూ మదుపర్ల నుంచి దాదాపు రూ.150 కోట్లకు పైగా వసూలు చేశారు. వీరిని నమ్మి రూ.లక్ష నుంచి రూ.కోటి వరకు బాండ్ల రూపంలో 1,500 మంది ఈ సంస్థలో పెట్టుబడులు పెట్టారు. మోసపోయామని ఆలస్యంగా తెలుసుకున్న బాధితులు పెద్ద ఎత్తున శుక్రవారం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఈటల, హరీశ్‌రావు ఇద్దరూ కలిసి .. కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడారు

: మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్: సర్జికల్ స్ట్రయిక్స్ చేసి గొప్పలు చెప్పుకొంటున్నారు.. అప్పట్లో ఇందిరా గాంధీ వందల కొద్దీ సర్జికల్ స్ట్రయిక్స్ చేసినా ఏనాడూ చెప్పుకోలేదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరాగాంధీ గొప్పతనాన్ని ఆనాడు వాజ్‌పేయీ కూడా గుర్తించి.. అపర కాళీ అని మెచ్చుకున్నారని గుర్తు చేశారు. అసలు ఇందిరాగాంధీకి.. మోదీకి



పోలిక ఏంటని ప్రశ్నించారు. "భాజపా, భారాస సయోధ్య గురించి కవిత ఇప్పుడు బయటపెడుతున్నారు. బండి సంజయ్‌ను భాజపా అధ్యక్ష పదవి నుంచి అన్యాయంగా తొలగించలేదా? భారాసతో దోస్తీకి అడ్డుగా ఉన్నందుకే సంజయ్‌ను తొలగించింది వాస్తవం కాదా? భాజపా నేతల ప్యాకేజీల గురించి రాజాసింగే చెబుతున్నారు. రాజాసింగ్ మాటలకు ఆ పార్టీ పెద్దలు సమాధానం చెప్పాలి. షామీర్‌పేటలోని ఓ ఫామ్‌హౌస్‌లో ఈటల రాజేందర్, హరీశ్‌రావును కలిశారు. ఇద్దరూ కలిసి కేసీఆర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఈటల రాజేందర్.. మోదీ పార్టీలో ఉన్నారా? కేసీఆర్ పార్టీలో ఉన్నారా? కాళేశ్వరం స్కామ్ నుంచి బయటపడేందుకు ఈటల.. కేసీఆర్‌తో చేతులు కలుపుతున్నారు" అని మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు.

## ఇందిరమ్మ ఇళ్లకు 2.10లక్షల లబ్ధిదారులు ఎంపిక

హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్లకు ఇప్పటి వరకు 2.10లక్షల మంది లబ్ధిదారులు ఎంపికైనట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వచ్చే నెల 10లోగా మిగతా లబ్ధిదారుల జాబితా సిద్ధమవుతుందన్నారు. పైలట్ ప్రాజెక్టులో 42వేల ఇళ్లు మంజూరు చేయగా.. 24వేలు ప్రారంభమయ్యాయని, సుమారు వంద ఇళ్లు గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. "లబ్ధిదారుల జాబితాకు సంబంధించి ప్రతిపక్ష ఎమ్మెల్యేలను 40 శాతం పేర్లు ఇవ్వమన్నాం. మిగతా 60శాతం ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేస్తాయి. కేటీఆర్ జాబితా ఇవ్వలేదు.. అధికారులనే ఎంపిక చేయమన్నారు. ఐటీడీఏ పరిధిలో చెంచులకు 9,200 ఇళ్లు మంజూరు చేశాం. హైదరాబాద్‌లోని 16 స్లమ్స్‌లో నాలుగంతస్తుల భవనాలు నిర్మిస్తాం. వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లోనూ ఇదే తరహాలో నిర్మిస్తాం" అని మంత్రి తెలిపారు.



## పీవోకేను పాకిస్థాన్‌కు ఎవరు ఇచ్చారు?

: కిషన్‌రెడ్డి

ఢిల్లీ: భారత సైన్యం విజయాన్ని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తక్కువ చేసి మాట్లాడటం దుర్మార్గమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. సైన్యం విజయాన్ని దేశమంతా పండుగ చేసుకుంటుంటే రేవంత్‌రెడ్డికి అది భాజపా కార్యక్రమంగా కనిపిస్తుందా అని మండిపడ్డారు. "మన ఎంపీలు పార్టీలను పక్కన పెట్టి ప్రపంచమంతా తిరుగుతున్నారు. 'ఆపరేషన్ సిందూర్' ఎందుకు చేయాల్సి వచ్చిందో ప్రపంచానికి చెబుతున్నారు. అసలు పీవోకేను పాకిస్థాన్‌కు ఎవరు ఇచ్చారు?. కాంగ్రెస్ కారణంగానే పీవోకే అంశం రావణ కాష్టంగా రగులుతూనే ఉంది.



ఉగ్రవాదులు దాడి చేస్తే గత కాంగ్రెస్ ప్రభుత్వాల్లాగా సంతాపాలతో సరిపుచ్చుకోలేదు. పాక్ భూభాగంలోకి వెళ్లి మరీ సర్జికల్ స్ట్రైక్ చేసింది మోదీ సర్కారు. పహల్గాం దాడి తర్వాత పాకిస్థాన్‌కు ఎలా నరకం చూపించామో ప్రపంచం చూసింది" అని కిషన్‌రెడ్డి అన్నారు.

### మీ సొంత పంచాయితీలు మీరే తేల్చుకోండి..

## మమ్మల్ని లాగొద్దు : కవిత వ్యాఖ్యలపై రఘునందన్

హైదరాబాద్: భాజపా ఎదుగుదలను ఆపాలని కుట్రలు పన్నుతున్నారని ఆ పార్టీ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా భారాస ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపైనా ఆయన స్పందించారు. "చిట్‌చాట్‌లు ఎందుకు?.. ధైర్యముంటే ప్రెస్‌మీట్‌లు పెట్టండి. తప్పుడు వార్తలు రాయిస్తున్నారని చెప్పడం ఎందుకు? భారాసతో మా పార్టీ అధిష్ఠానం ఎప్పుడూ మాట్లాడలేదు. లేనిపోని పంచాయితీలు ఎందుకు?.. కుండ బద్దలు కొట్టినట్లు చెప్పండి. చిట్‌చాట్‌ల పేరుతో మా పార్టీని వివాదంలోకి లాగొద్దని కవితకు విజ్ఞప్తి చేస్తున్నా. మీ సొంత పంచాయితీలు మీరే తేల్చుకోండి.. మమ్మల్ని లాగొద్దు. తెరాస (ప్రస్తుతం భారాస) గతంలో అనేక పార్టీలతో పొత్తు పెట్టుకుంది. 2004లో



కాంగ్రెస్‌తో తెరాస పొత్తు పెట్టుకుంది. 2009లో మహా కూటమి పేరుతో పలు పార్టీలతో పొత్తు పెట్టుకుంది. 2014లో పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తామన్నది ఎవరు? భారాసతో భాజపా ఎప్పుడైనా పొత్తు పెట్టుకుందా?

* **హరీశ్ కోవర్టు అయితే ఎందుకు సస్పెండ్ చేయలేదు?**

రాష్ట్రంలో భాజపా బలం పుంజుకుంటోంది.. కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోతోంది. పార్లమెంటు ఎన్నికల్లో భారాస ఒక్క సీటూ గెలవలేదు. ఆ పార్టీ చెల్లని రూపాయిగా మారిందని ప్రజలు భావిస్తున్నారు. భాజపా, భారాస ఒక్కటేనే తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత చెల్లని రూపాయి అయ్యారు. పదేళ్ల పాలనలో అమరుడు శ్రీకాంత్‌చారి కుటుంబానికి ఏమీ దక్కలేదు. తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన 1200 మంది అమరులను పట్టించుకోలేదు. కేసీఆర్ కుటుంబం పదేళ్లు దోచుకుంది. హరీశ్‌రావు భాజపా కోవర్టు అయితే మంత్రివర్గం నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదు? భారాస బలహీనపడాలి అనుకునేవాళ్లే కవిత వెనక ఉన్నారు. ఆమె కొత్త పార్టీ పెడతోందని నాకు సమాచారముంది. భారాసకు అభ్యర్థులు లేక ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయలేదు. కోవర్టు పని చేసే వాళ్లు భాజపాలో ఉండరు" రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు.




## కొత్తగూడెంలో 17 మంది మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం నేరవిభాగం: కొత్తగూడెంలో 17 మంది మావోయిస్టు సభ్యులు జిల్లా పోలీసులు, సీఆర్పీఎఫ్ అధికారుల సమక్షంలో లొంగిపోయారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడారు. లొంగిపోయిన వారిలో ఏసీఎం క్యాడర్‌కు చెందిన ఇద్దరు, పార్టీ సభ్యులు నలుగురు, మిలీషియా సభ్యులు 11 మంది ఉన్నట్లు వివరించారు. ఏజెన్సీ ప్రాంత వాసుల్లో మావోయిస్టు సిద్ధాంతాలపై నమ్మకం సన్నగిల్లిందన్నారు. తెలంగాణలో మావోయిస్టులకు ఆశ్రయం ఉండే పరిస్థితులు లేవని చెప్పారు. విశ్వసనీయ సమాచారంతో ఇటీవల జిల్లాలో 20 మంది సాయుధ దళ సభ్యులను అరెస్టు చేసి 12 ఆయుధాలను జప్తు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 282 మంది మావోయిస్టు దళ సభ్యులు జనజీవన స్రవంతిలో కలిసి తగిన పునరావాస సౌకర్యాలను పొందినట్లు ఎస్పీ వివరించారు.

### ఏషియన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో

## హైదరాబాద్ అమ్మాయి నందినికి స్వర్ణ పతకం

అంతర్జాతీయ అథ్లెటిక్స్ వేదికపై తెలుగు తేజం నందిని అగసర సత్తా చాటింది. సికింద్రాబాద్‌కు చెందిన యువ అథ్లెట్ నందిని అగసర, ఏషియన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించి భారతదేశ కీర్తి పతాకాన్ని రెపరెపలాడించింది. దక్షిణ కొరియాలోని గుమీ నగరంలో జరుగుతున్న 26వ ఏషియన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 2025లో మహిళల హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో నందిని ఈ అద్భుత విజయాన్ని అందుకుంది. ఏడు కఠినమైన క్రీడాంశాలతో కూడిన హెప్టాథ్లాన్‌లో నందిని అసాధారణ ప్రతిభ కనబరిచింది. పోటీ ఆద్యంతం హోరాహోరీగా సాగగా, ముఖ్యంగా చివరిదైన 800 మీటర్ల పరుగు పందెంలో ఆమె అద్భుత ప్రదర్శన చేసింది. ఈ పరుగును కేవలం 2 నిమిషాల 15.54 సెకన్లలో పూర్తి చేసి 885 పాయింట్లను తన ఖాతాలో వేసుకుంది. అంతకుముందు జరిగిన జావెలిన్ త్రో ఈవెంట్‌లో (34.18 మీటర్లు) కొంత వెనుకబడినప్పటికీ, చివరి పరుగులో అద్భుతంగా పుంజుకుని విజయాన్ని ఖాయం చేసుకుంది. అన్ని ఈవెంట్లలో కలిపి నందిని మొత్తం 5,941 పాయింట్లు సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. ఈ విజయంతో నందిని అగసర ఒక అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఏషియన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో హెప్టాథ్లాన్ విభాగంలో స్వర్ణం గెలిచిన మూడో భారతీయ మహిళగా ఆమె చరిత్ర సృష్టించింది. గతంలో 2005లో సోమా బిస్వాస్, 2017లో స్వప్నా బర్మన్ ఈ ఘనతను సాధించారు.

# రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాలు.. డీలర్లు సిద్ధం కావాలి

**: మంత్రి నాదెండ్ల**



విజయవాడ: ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సరకుల పంపిణీ చేపడుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలో కలెక్టర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. కూటమి ప్రభుత్వం నిర్ణయం మేరకు జూన్ 1 నుంచి డీలర్లు రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాల పంపిణీకి సిద్ధం కావాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా రేషన్ డీలర్లు పనిచేయాలని కోరారు. గతంలో కార్డుదారుల కుటుంబాలకు కుటుంబ పెద్దలా ఉన్న రేషన్ డీలర్లు అదే విధంగా ఇప్పుడు కూడా మనసుపెట్టి పనిచేసి లబ్ధిదారులకు గౌరవంగా సేవలందించాలన్నారు. రేషన్ దుకాణాల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడటం, సరైన తూకంతో సరకులు పంపిణీ చేయటం, ధరలు, స్టాక్ బోర్డ్, పోస్టర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటివద్దే రేషన్ సరకులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతినెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆదివారాల్లో సైతం సరకుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఒకటో తేదీ నుంచి 5వ తేదీలోపే దివ్యాంగులు, వృద్ధులకు రేషన్ సరకులు పంపిణీ చేసేందుకు చొరవ చూపాలని మంత్రి సూచించారు. వాట్సప్ గ్రూపు ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందించడం వల్ల కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడవచ్చన్నారు. ఒకవేళ ఎప్పుడైనా సాంకేతిక సమస్యలు ఎదురైనాసరే కార్డుదారులకు ఇబ్బందిలేకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సరుకుల పంపిణీ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. ఈపోస్, వేయింగ్ మిషన్ల రిపేర్లకు సంబంధించి సర్వీసు క్యాంపులు ప్రతి జిల్లాలో ఏర్పాటు చేశామన్నారు.

## 'మహానాడులో నందమూరి ఫ్యామిలీ లేదు'..
# మాజీ మంత్రి సంచలన వ్యాఖ్యలు



కడప జిల్లాలో మూడు రోజులు జరిగిన టీడీపీ మహానాడు పై వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ రోజు(శుక్రవారం) ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కడపలో మహానాడు పెట్టడం వల్ల తమకు బలం ఉందని నిరూపించే ప్రయత్నం చేశారని అంబటి రాంబాబు ఆరోపించారు. ఈ మూడు రోజుల మహానాడు కార్యక్రమంలో తాము అధికారంలోకి వచ్చి ఏం చేశారో మాత్రం చెప్పలేదని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల పై మాట్లాడలేదు. ప్రజలకు ఇస్తామన్న సంక్షేమ పథకాల్లో ఏది ఎప్పుడు అమలు చేస్తారో కూడా చెప్పలేకపోయారని మాజీ మంత్రి అంబటి దుయ్యబట్టారు. అధికారంలో లేనప్పుడు సీనియర్ ఎన్టీఆర్‌కు భారత రత్న ఇవ్వాలి అంటారు. ఇప్పుడు ఎన్డీయే కూటమిలో కీలకంగా ఉన్నారు. వారు ఎన్టీఆర్‌కు భారతరత్న పై ప్రతిపాదన చేయొచ్చు కదా అన్నారు. మహానాడు కార్యక్రమం అంతా ఓ డ్రామ. అందులో ఆర్టిస్టులను తీసుకొచ్చారని ఆయన ఎద్దేవా చేశారు. టీడీపీ మహానాడులో నందమూరి ఫ్యామిలీ లేదు అన్నారు. మహానాడు వేదిక పై నందమూరి వంశంలోని ఒక్కరు కూడా కనిపించలేదని పేర్కొన్నారు. దీంతో ఈ కార్యక్రమం కాస్త నారావారి మహానాడులా మారిపోయిందని ఎద్దేవా చేశారు. అనుభవం లేకుండా నారా లోకేష్ మాట్లాడుతున్నారని చెప్పారు. అన్యాయంగా మా కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవని మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు.

## ఖరీదైన కార్లు ఎవరి కోసం కొన్నారు?..
# లిక్కర్ స్కామ్ నిందితులకు సిట్ ప్రశ్నల వర్షం



విజయవాడ: లిక్కర్ స్కామ్‌లో నిందితుల విచారణ తొలిరోజు ముగిసింది. సిట్ చీఫ్ రాజశేఖర్‌బాబు ఆధ్వర్యంలో నలుగురు నిందితులను 8గంటల పాటు వేర్వేరుగా విచారించారు. కేసులో ఏ1 రాజ్ కెసిరెడ్డితో పాటు ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలను రాజశేఖర్‌బాబు నేరుగా విచారించారు. స్కాంలో ఈ నలుగురి పాత్ర కీలకంగా ఉందని ఇప్పటికే సిట్ గుర్తించింది. స్కామ్‌లో వసూలు చేసిన డబ్బును ఎక్కడెక్కడ పెట్టుబడులుగా పెట్టారు? ఎక్కడ ఖరీదైన ఆస్తులు కొన్నారని ప్రశ్నించినట్లు సమాచారం. ఖరీదైన కార్లు ఎవరి కోసం కొన్నారని ప్రశ్నించారు. నిందితుల కుటుంబ సభ్యుల వ్యాపారాల్లో పెట్టుబడులుగా వచ్చిన డబ్బుల గురించి బ్యాంక్ ఖాతాల ఆధారంగా నిందితులకు ప్రశ్నలు సంధించారు. 20192024 మధ్య నిందితులు కొనుగోలు చేసిన ఆస్తుల వివరాలను రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి సిట్ సేకరించింది. ఈ ఆస్తుల వివరాల ఆధారంగా సిట్ అధికారులు నిందితులను ప్రశ్నించారు.

## తిరుమలలో భద్రత బలోపేతంపై
# డీజీపీ, తితిదే ఈవో ఉన్నత స్థాయి సమావేశం



తిరుమల: దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా తిరుమలలో భద్రత బలోపేతంపై ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, తితిదే ఈవో జె.శ్యామలరావు సమక్షంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో తిరుపతి ఎస్పీ, తితిదే ఇన్‌ఛార్జ్ సీవీఎస్‌వో హర్షవర్ధన్ రాజు భద్రతా అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో తిరుమలకు ఉన్న ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకొని మెరుగైన భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయడం అవసరమని తెలిపారు. ఏపీఎస్పీ, డీఏఆర్, ఎస్పీఎఫ్, హోంగార్డు, సివిల్ పోలీసులు, తితిదే సెక్యూరిటీతోపాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీమ్ ఏర్పాటుపై దృష్టి పెట్టాలని సూచించారు. వివిధ సెక్యూరిటీ ఏజెన్సీలకు స్థిరమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ రూపొందించాలన్నారు. అలిపిరి వద్ద బహుళ స్థాయి వాహన తనిఖీ వ్యవస్థ, డిఫెన్స్ ఏజెన్సీలతో కలిసి సెన్సార్ ఫ్లే సిస్టమ్, ఆధునిక భద్రతా పరికరాలు, సైబర్ భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడం వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. తితిదే ఈవో జె. శ్యామలరావు మాట్లాడుతూ.. భద్రతపై అనుబంధ ఏజెన్సీలతో ఒక సమన్వయ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడ్డారు. తిరుమలలో సైబర్ భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. విస్తృతస్థాయిలో తిరుమల భద్రతపై సమీక్ష నిర్వహించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీజీ(లా అండ్ ఆర్డర్) సుధాకర్‌రెడ్డి, అడిషనల్ డీజీ (ఇంటెలిజెన్స్) మహేశ్ చంద్ర లడ్హా, అనంతపురం రేంజ్ డీఐజీ డా.శేముషి, ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, తితిదే అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నారా లోకేశ్ కు మంచి ఫ్యూచర్ ఉంది

**: జేసీ ప్రభాకర్ రెడ్డి**



* **నారా లోకేశ్ ప్రజలతో మమేకమవుతున్నారని, ఆయనకు మంచి భవిష్యత్తు ఉందని ప్రశంస**
* **టీడీపీ మహానాడుకు వచ్చిన జనాలను చూసి ఆశ్చర్యపోయానన్న జేసీ**
* **వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆప్యాయతను గుర్తుచేస్తూ, జగన్ తీరును ప్రశ్నించిన వైనం**

రాష్ట్ర రాజకీయాల్లో తనదైన శైలిలో ముక్కుసూటిగా వ్యాఖ్యలు చేసే తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్, టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ పై ప్రశంసల వర్షం కురిపించారు. యువనేత లోకేశ్ ప్రజలతో మమేకమవుతున్న తీరు అభినందనీయమని, ఆయనకు అద్భుతమైన రాజకీయ భవిష్యత్తు ఉందని జోస్యం చెప్పారు. అదే సమయంలో, వైసీపీ అధినేత జగన్ తన వైఖరి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని,రాజకీయ సమాధి తప్పదని ఘాటుగా హెచ్చరించారు. ఓ ప్రముఖ తెలుగు వార్తా ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో జేసీ ఈ వ్యాఖ్యలు చేశారు.

**లోకేశ్ లో పరిణతి.. ప్రజాదరణ**

నారా లోకేశ్ గురించి జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, "లోకేశ్ యువకుడు, విద్యావంతుడు. ముఖ్యంగా, ఆయన ప్రజలతో కలిసిపోతున్న తీరు నన్ను ఆకట్టుకుంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులే కాకుండా సాధారణ ప్రజలతో సైతం ఆయన ఎంతో ఓపికగా, ఆప్యాయంగా సంభాషిస్తున్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ప్రజలతో ఇంతలా మమేకమయ్యే నాయకులకు ఉజ్వల భవిష్యత్తు కచ్చితంగా ఉంటుంది. ఆయనలో రోజురోజుకూ పరిణతి కనిపిస్తోంది. ఇది పార్టీకి, రాష్ట్రానికి శుభపరిణామం" అని కొనియాడారు. యువశక్తి, ప్రజాకర్షణ లోకేశ్ ను ఉన్నత స్థానానికి తీసుకెళతాయని జేసీ దృఢ విశ్వాసం వ్యక్తం చేశారు.

* **జగన్‌కు హితవు.. మారకుంటే రాజకీయ సమాధే!**

జగన్ తీరుపై జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "జగన్, నువ్వు మాకు కావాల్సిన వాడివి. మీ అమ్మగారు మా తాడిపత్రి ప్రాంతం నుంచి వచ్చినవారే. నాకు ముగ్గురు నేతలంటే ప్రత్యేక అభిమానం, అందులో మీ తండ్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారు ఒకరు. ఆయన నాతోసహా అందరితో ఎంతో ఆప్యాయంగా ఉండే వారు. ఎక్కడ కనపడినా ప్రేమగా పలకరించేవారు. కానీ, జగన్, నువ్వు ఎందుకిలా తయారయ్యావు?" అని ఆవేదన వ్యక్తం చేశారు. "మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం, అది చేస్తాం, ఇది చేస్తాం అని బెదిరింపు ధోరణి ప్రదర్శించడం సరైంది కాదు. ఇప్పటికైనా మారకపోతే రాజకీయంగా భూస్థాపితం కావడం ఖాయం" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు.

* **మహానాడు జనసంద్రం చూసి విస్మయం చెందాను!**

కడపలో జరిగిన టీడీపీ మహానాడుకు అనూహ్యంగా తరలివచ్చిన జనసందోహాన్ని చూసి తాను విస్మయానికి గురయ్యానని జేసీ తెలిపారు. నాయకుల కంటే సాధారణ ప్రజలే అధిక సంఖ్యలో స్వచ్ఛందంగా పాల్గొనడం, పార్టీ పట్ల వారికున్న నమ్మకాన్ని సూచిస్తోందన్నారు.

## బుడమేరుకు గండి..
# అధికారులకు మంత్రి నిమ్మల కీలక ఆదేశాలు



గతేడాది కురిసిన భారీ వర్షాలకు బుడమేరుకు గండి పడటంతో విజయవాడను వరదలు ముంచెత్తిన విషయం తెలిసిందే. కట్టుబట్టలతో లక్షలాది మంది ప్రజలు పునరావాస కేంద్రాల్లో తలదాచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ వరదలను తలచుకుంటేనే ఇప్పటికీ సింగ్ నగర్, పరిసర ప్రాంతాల వాసులు వణికిపోతారు. జీవితంలో మళ్లీ అలాంటి వరదలు రాకూడదని, అలాంటి ఉపద్రవాలను తట్టుకోలేమని చెప్తారు. కాగా.. గతేడాది భారీ వరదల కారణంగా బుడమేరుకు గండ్లు పడిన ప్రాంతాల్లో మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం పర్యటించారు. గండ్లు పడిన ప్రాంతాల్లో జరుగుతున్న సీసీ వాల్ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. అత్యవసరంగా బుడమేరుకు పడిన మూడు గండ్లను పూడ్చగా.. వాటిని కలుపుతూ రూ.23 కోట్లతో సీసీ వాల్ నిర్మాణం చేపడుతున్నారు. ఈ వర్షాకాలం సీజన్ మొదలయ్యేలోగా నిర్మాణం పూర్తి చేయాలని మంత్రి నిమ్మల కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. పనులు నత్తనడకల సాగుతుండటంపై కాంట్రాక్ట్ ఏజెన్సీకి ఆయన నోటీసులు జారీ చేశారు. సీసీ వాల్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, ఇకపై మూడు షిఫ్టుల్లో పనిచేయాలని సదరు ఏజెన్సీని ఆదేశించారు.

# రానున్న మూడ్రోజుల పాటు ఏపీకి వర్ష సూచన

రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు వాతావరణంలో మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఆకాశం మేఘావృతమై ఉండటంతో పాటు, పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రజలకు ఇది కొంత ఉపశమనం కలిగించే వార్త కాగా, ఏయే ప్రాంతాల్లో వర్షాలు పడతాయోనన్న ఆసక్తి నెలకొంది. వివరాల్లోకి వెళితే, ముఖ్యంగా శనివారం నాడు రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో వర్షాలు కురిసే సూచనలున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని అధికారులు తెలిపారు. ఇదే సమయంలో పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య జిల్లాల్లో కూడా ఇలాంటి వర్షపాతమే నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# అమ్మకాల ఒత్తిడి... నష్టాలతో ముగిసిన మార్కెట్లు

## ఆటో, మెటల్, ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి

## 182 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

## 82 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి అందిన బలహీన సంకేతాలతో ఉదయం నష్టాలతో ప్రారంభమైనప్పటికీ, కొన్ని ప్రధాన షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో కాసేపు లాభాల బాట పట్టాయి. అయితే, ఆటో, ఐటీ, మెటల్ రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు తిరిగి నష్టాల్లోకి జారుకున్నాయి. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 182 పాయింట్లు నష్టపోయి 81,451 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 82 పాయింట్ల నష్టంతో 24,750 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్, ఎన్టీపీసీ, సన్‌ఫార్మా, నెస్లే ఇండియా, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. మరోవైపు ఎటర్నల్, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు లాభాలను ఆర్జించాయి. ఇక డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ. 85.57 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 64.41 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, బంగారం ధర ఔన్సుకు 3,296 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# గోల్డ్ లోన్స్‌పై కేంద్రం కీలక నిర్ణయం..

## కొత్త మార్గదర్శకాలు ప్రతిపాదనలో ఆర్‌బీఐ!




**న్యూఢిల్లీ:** భారతదేశంలో బంగారాన్ని పెట్టుబడిగా భావిస్తారు. ఇది కష్ట సమయాల్లో ఉత్తమ మూలధనంగా ఉపయోగపడుతుంది. బహుశా ఈ నమ్మకం వల్లనే, పురాతన కాలం నుండి దేశంలో 'గోల్డ్ లోన్' లాంటి సౌకర్యం ఉంది. 'మదర్ ఇండియా' సినిమాలోని 'బిర్జు' ని మీరు గుర్తుంచుకునే ఉంటారు. అతను తన తల్లి తనఖా పెట్టిన గాజులను సుఖి లాలా నుండి విడిపించుకుంటాడు. ఎందుకంటే అతని తల్లి ఆ గాజులకు బదులుగా లాలా నుండి అప్పు తీసుకుంది.

గతంలో, గ్రామాలు, పొరుగు ప్రాంతాలలో, ధనవంతులు లేదా వడ్డీ వ్యాపారులు తమ బంగారాన్ని తాకట్టుగా ఉంచి అవసరమైన వారికి నగదు ఇచ్చేవారు. అప్పుడు ఈ బంగారం తరచుగా జప్తు చేయడం జరిగేది. తరువాత, దీని నుండి ప్రజలను రక్షించడానికి, బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు బంగారు రుణాల అందించడం ప్రారంభించాయి. ఇప్పుడు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులు, ఈ బంగారు రుణ సౌకర్యాన్ని ఏకరీతి నిబంధనల పరిధిలోకి తీసుకురావాలని కోరుకుంటోంది. సామాన్యుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆర్‌బిఐకి అనేక సూచనలు చేసింది. భారత రిజర్వ్ బ్యాంక్ రూపొందించిన బంగారు రుణాల కోసం ఏకరీతి నియమాల ముసాయిదాను ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం సమీక్షించింది. దీని తరువాత, కొత్త నిబంధనలను అమలు చేసే ముందు అనేక విషయాలను దృష్టిలో ఉంచుకోవాలని కోరింది.

సామాన్యులకు బంగారు రుణం అవసరమని దృష్టిలో ఉంచుకుని, కొత్త నిబంధనలను అమలు చేస్తున్నప్పుడు, చిన్న మొత్తాలకు రుణాలు తీసుకునే వారిపై ప్రతికూల ప్రభావం చూపకూడదని ప్రభుత్వం పేర్కొంది. అంతే కాదు, వీలైతే, రూ. 2 లక్షల వరకు బంగారు రుణం తీసుకునే వ్యక్తులను ఆర్‌బిఐ ఈ కఠినమైన నిబంధనల పరిధికి దూరంగా ఉంచాలి. తద్వారా చిన్న రుణగ్రహీతలు త్వరగా, సకాలంలో బంగారు రుణాన్ని పొందవచ్చు. ఈ బంగారు రుణ నియమాలను సరిగ్గా అమలు చేయడానికి సమయం పడుతుంది. కాబట్టి, దాని సన్నాహాలు పూర్తి చేసిన తర్వాత, జనవరి 1, 2026 కి ముందు దీనిని అమలు చేయకూడదని కేంద్ర మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ సూచనలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీక్షిస్తోంది. త్వరలో దానిపై నిర్ణయం తీసుకోవచ్చు. అదే సమయంలో, ప్రభుత్వం తన సూచనలపై, ఈ విషయానికి సంబంధించిన అన్ని వాటాదారులను ఆర్‌బిఐ సంప్రదిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఇది సామాన్య ప్రజల నుండి సూచనలను కూడా పొందుతుంది.

### కొత్త బంగారు రుణ నియమాలు ఏమిటి?

ప్రస్తుతం దేశంలోని బ్యాంకులు, వాటి స్వంత నిబంధనల ప్రకారం బంగారు రుణాలను మంజూరు చేస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థలో బంగారు రుణాలకు సంబంధించి ఏకరూపత, పారదర్శకతను తీసుకురావాలని ఆర్‌బిఐ కోరుకుంటుంది. దీని కోసం కొత్త నియమాలను రూపొందించింది, అవి ఈ క్రింది విధంగా ఉన్నాయి

తాకట్టు పెట్టిన బంగారం మొత్తం విలువలో 75 శాతం వరకు ప్రజలకు రుణాలు ఇవ్వాలని ఆర్‌బిఐ కోరుతోంది. అంటే మీ బంగారం విలువ రూ. 100 అయితే, మీకు రూ. 75 మాత్రమే రుణం లభిస్తుంది. బంగారు రుణం తీసుకునే వారు తాము తాకట్టు పెట్టిన బంగారంపై యాజమాన్య హక్కులు తమకు ఉన్నాయని రుజువును అందించాలి. దీని కోసం అతను అసలు బిల్లు లేదా అఫిడవిట్ ఇవ్వాల్సి ఉంటుంది.

బంగారు రుణం కోసం తాకట్టు పెట్టిన బంగారం స్వచ్ఛత ధృవీకరణ పత్రాన్ని జారీ చేయడం బ్యాంకు లేదా బాధ్యత. ఆభరణాలలో మిశ్రమ లోహం, రత్నాలు లేదా వజ్రాలు లేదా విలువైన రాళ్ళు ఉంటే, లేదా దాని క్యారెట్ ఎంత. వీటన్నింటి గురించిన సమాచారాన్ని ఆ సర్టిఫికెట్‌లో విడిగా ఇవ్వాలి. ఏ బంగారు ఆభరణాలు లేదా వస్తువులు, బంగారు నాణేలు లేదా కడ్డీలు రుణంగా తాకట్టు పెట్టడానికి అర్హత పొందుతాయి. వీటికి కూడా స్థిర నియమాలు రూపొందించడం జరుగుతుంది. అదే సమయంలో, మొత్తం రుణంలో బంగారు నాణేల వాటా స్థిర పరిమితి వరకు ఉంటుంది. ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం, బంగారు రుణం కోసం తనఖా పెట్టే బంగారం 22 క్యారెట్లు లేదా అంతకంటే ఎక్కువ ఉండాలి. దీని విలువ 22 క్యారెట్ల ప్రకారం నిర్ణయించడం జరుగుతుంది. 18 క్యారెట్ల బంగారాన్ని తనఖా పెట్టినా, దాని విలువను 22 క్యారెట్ల ప్రకారం లెక్కిస్తారు. కొత్త నిబంధనల ప్రకారం, వెండి ఆభరణాలు, నాణేలను తాకట్టు పెట్టడం ద్వారా కూడా రుణాలు తీసుకోవచ్చు. దీనికి కూడా ఆర్‌బిఐ ప్రమాణాలను నిర్దేశిస్తుంది. ఇది 925 స్వచ్ఛత వెండికి చెల్లుబాటు కావచ్చు. ఇది కాకుండా, బంగారు రుణం కోసం కస్టమర్‌తో సంతకం చేసే ఒప్పందంలో ప్రతి నియమం గురించి పూర్తి సమాచారం ఉంటుంది. రుణం పూర్తయిన తర్వాత, తాకట్టు పెట్టిన బంగారాన్ని నిర్ణీత వ్యవధిలోపు కస్టమర్‌కు తిరిగి ఇస్తారు. ఇదిలావుంటే, ఆర్థిక శాఖ నుంచి ఈ ప్రకటన వెలువడిన వెంటనే, బంగారు రుణాలు మంజూరుచేసే కంపెనీల షేర్లు దూసుకుపోయాయి. ముఖ్యంగా ముత్తూట్ ఫైనాన్స్ షేర్లు ఇంట్రాడేలో 8.6 శాతం లాభపడి రూ.2,243 (ఎన్‌ఎస్ఈ) వద్ద గరిష్ఠాన్ని తాకాయి. మణప్పురం ఫైనాన్స్ షేర్లు ఎన్ఎస్ఈలో 4 శాతం పెరగ్గా, ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ 2 శాతం పెరిగింది. ముత్తూట్ ఫైనాన్స్ జారీ చేసే రుణాల్లో 98 శాతం వరకు బంగారం తాకట్టు పెట్టుకుని ఇచ్చేవే కావడం గమనార్హం.

# ఐపీఎల్ ఎలిమినేటర్‌లో ముంబై ఘనవిజయం

**గుజరాత్ టైటాన్స్ ఇంటికి!**

**ఐపీఎల్ 2025 ఎలిమినేటర్‌లో గుజరాత్‌పై ముంబై గెలుపు**

**20 పరుగుల తేడాతో టైటాన్స్‌ను ఓడించిన ఇండియన్స్**

**ముంబై తరపున రోహిత్ శర్మ 81 పరుగులతో టాప్ స్కోరర్**

**గుజరాత్ జట్టులో సాయి సుదర్శన్ 80 పరుగులు చేసినా ఓటమి**

**ఈ విజయంతో ముంబై ముందంజ, గుజరాత్ టోర్నీ నుంచి నిష్క్రమణ**





**ఛండీఘర్:** ఐపీఎల్ 2025 నుంచి గుజరాత్ టైటాన్స్ నిష్క్రమించింది. శుక్రవారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన ఎలిమినేటర్‌లో 20 రన్స్ తేడాతో ఓడిపోయింది. ఈ విజయంలో ముంబై ఇండియన్స్ క్వాలిఫయర్-2కి అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై.. గుజరాత్ ముందు 229 పరుగుల లక్ష్యాన్ని నిలిపింది. అనంతరం గుజరాత్.. 208 పరుగులకే పరిమితమైంది.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. దీంతో గుజరాత్ టైటాన్స్ తొలుత బౌలింగ్ చేయాల్సి వచ్చింది. కెప్టెన్ హార్దిక్ పాండ్యా నమ్మకాన్ని నిలబెడుతూ ముంబై బ్యాటర్లు ఆది నుంచీ ఎటాకింగ్ గేమ్ ఆడారు. ఓవైపు రోహిత్ శర్మ (50 బంతుల్లో 81 రన్స్), మరోవైపు జానీ బెయిర్‌స్టో (22 బంతుల్లో 47 రన్స్) ఎదురుదాడికి దిగారు. దీంతో ముంబై స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. వీరిద్దరి తర్వాత సూర్యకుమార్ యాదవ్ (20 బంతుల్లో 33 రన్స్), తిలక్ వర్మ (11 బంతుల్లో 25 రన్స్), హార్దిక్ పాండ్యా (9 బంతుల్లో 22 రన్స్) కూడా రాణించడంతో ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 228/5 పరుగులు చేసింది.

అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్‌కు.. ట్రెంట్ బౌల్ట్ తొలి ఓవర్‌లోనే షాక్ ఇచ్చాడు. సూపర్ ఫామ్‌లో ఉన్న గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (1)ను నాలుగో బంతికే ఔట్ చేశాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కుశాల్ మెండిస్ (10 బంతుల్లో 20 రన్స్) ఉన్నంత సేపు అలరించాడు. అయితే అతడు హిట్ వికెట్‌గా వెనుదిరిగాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా.. సాయి సుదర్శన్ (49 బంతుల్లో 80 రన్స్) మాత్రం పోరాటం కొనసాగించాడు.

వాషింగ్టన్ సుందర్ (24 బంతుల్లో 48 రన్స్) కూడా రాణించడంతో గుజరాత్ టైటాన్స్.. 13.3 ఓవర్లలో 151/3తో మెరుగైన స్థితిలో నిలిచింది. కానీ ఆ తర్వాత బుమ్రా ఎంట్రీతో సీన్ రివర్స్ అయింది. కళ్లు చెదిరే యార్కర్‌తో వాషింగ్టన్‌ను ఔట్ చేసిన బుమ్రా.. మ్యాచ్ గమనాన్నే మార్చేశాడు. ఆ తర్వాత సాయి సుదర్శన్, రూథర్‌ఫోర్డ్, షారుఖ్ ఖాన్ కూడా ఔట్ కావడంతో గుజరాత్ టైటాన్స్ పరాజయం పాలైంది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 208 రన్స్ చేసింది. దీంతో 20 రన్స్ తేడాతో ఓడిపోయింది. ఇక ఈ మ్యాచ్‌లో ఓడిన గుజరాత్.. టోర్నీ నుంచి నిష్క్రమించింది. ముంబై ఇండియన్స్-పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య ఆదివారం క్వాలిఫయర్-2 మ్యాచ్ జరగనుంది.

# సడన్‌గా ఇంగ్లండ్‌కు కేఎల్ రాహుల్



**ముంబై:** టీమిండియా క్రికెటర్ కేఎల్ రాహుల్ హుటాహుటిన ఇంగ్లండ్ వెళ్లనున్నాడు. సోమవారం అతను ఇంగ్లండ్ వెళ్లేందుకు సిద్ధం అవుతున్నాడు. జూన్‌లో ఇంగ్లండ్‌తో జరిగే టెస్టు సిరీస్‌కు రెఢీ అవుతున్న సీనియర్ టీమిండియా క్రికెటర్.. ప్రిపరేషన్ కోసం ముందే వెళ్తున్నట్లు సమాచారం. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపు ఆడిన కేఎల్ రాహుల్.. ప్రస్తుతం ఇంగ్లండ్‌లో టూరు చేస్తున్న ఇండియా ఏ జట్టు తరపున ఆడాలనుకుంటున్నాడు. సీనియర్ల టెస్టు సిరీస్ కు ఎంపికైన అతను.. ప్రాక్టీసు కోసం ముందే ఇంగ్లండ్‌కు వెళ్లాలనుకుంటున్నాడు. దీని కోసం అతను బీసీసీఐ నుంచి పర్మిషన్ కూడా తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఇంగ్లండ్ లయన్స్‌తో ఇండియా ఏ జట్టు టెస్టు మ్యాచ్ ఆడనున్నది. మే 30వ తేదీ నుంచి క్యాంటర్ బరీలో తొలి టెస్టు జరగనున్నది అయితే ఆ మ్యాచ్‌ను రాహుల్ అందుకోలేడు. కానీ రెండవ మ్యాచ్‌లో ఆడేందుకు అనుమతి పొందిన కేఎల్ రాహుల్.. తొందరగా ఇంగ్లండ్ వెళ్లేందుకు రెఢీ అయ్యాడు. సోమవారం ఇంగ్లండ్‌కు రాహుల్ వెళ్తున్నాడని, ఇండియా ఏ తరపున రెండో అనధికార టెస్టులో ఆడనున్నట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి.

జూన్ 6వ తేదీన ఇండియా ఏ, ఇంగ్లండ్ లయన్స్ జట్ల మధ్య రెండో అన్అఫీషియల్ టెస్టు ప్రారంభంకానున్నది. ఇక సీనియర్ మెన్స్ క్రికెట్ జట్టు జూన్ 13వ తేదీన ప్రాక్టీసు మ్యాచ్ ఆడనున్నది. 5 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ జూన్ 20వ తేదీ నుంచి లీడ్స్‌లో ప్రారంభంకానున్నది.

# ఫైనల్లో ఆర్సీబీ గెలిస్తే పబ్లిక్ హాలిడే ప్రకటించాలి

## సీఎం సిద్ధరామయ్యకు ఫ్యాన్స్ విజ్ఞప్తి

**బెంగళూరు:** ఐపీఎల్ ట్రోఫీ కోసం నిరీక్షిస్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫైనల్‌కు దూసుకెళ్లింది. 'ఈ సాలా కప్ నమదే' నినాదంతో ప్రతిసారి ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్న ఆర్సీబీ.. 18వ సీజన్‌లో ట్రోఫీకి అడుగు దూరంలో నిలిచింది. లీగ్ దశ నుంచి అదరగొట్టిన బెంగళూరు జట్టు క్వాలిఫయర్ 1లో పంజాబ్ కింగ్స్‌పై అద్భుత విజయంతో అంతిమ పోరుకు అర్హత సాధించింది. దాదాపు తొమ్మిదేండ్ల తర్వాత ఆర్సీబీ తుది పోరుకు అర్హత సాధించడంతో ఆర్సీబీ ఫ్యాన్స్ ఆనందాలకు అవధుల్లేవు. ఈ సారి ఎలాగైన జట్టు గెలుస్తుందన్న ధీమాతో ఉన్నారు.





ఈ నేపథ్యంలో ఆర్సీబీ అభిమాని ఒకరు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఓ కీలక విజ్ఞప్తి చేశారు. బెలగావి జిల్లాకు చెందిన శివానంద్ మల్లనావర్ ఈ మేరకు సీఎంకు లేఖ రాశారు. ఈసారి ఫైనల్లో బెంగళూరు జట్టు గెలిస్తే ఆ రోజును కర్ణాటక ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని సీఎంను కోరారు. అంతేకాదు ప్రతి ఏటా ఆ రోజును పబ్లిక్ హాలిడేగా ప్రకటించాలన్నారు. ఆర్సీబీ విజయాన్ని రాష్ట్ర వ్యాప్తంగా సెలబ్రేట్ చేసుకునేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ).. అదరగొట్టింది. తమ చిరకాల కలను సాకారం చేసుకునేందుకు మరో అడుగు ముందు కేసింది. లీగ్ దశ జోరును కీలకమైన ప్లేఆఫ్స్‌లోనూ కొనసాగిస్తూ క్వాలిఫయర్-1లో పంజాబ్ కింగ్స్‌ను మట్టికరిపించింది. వార్ వన్‌సైడ్ అన్నట్లు ఏకపక్షంగా సాగిన పోరులో ఆర్సీబీ సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ ఘన విజయంతో 2016 తర్వాత తొలిసారి ఐపీఎల్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బెంగళూరు జట్టు ఐపీఎల్ ఫైనల్ చేరడం ఇది నాలుగోసారి. ఇంతకుముందు 2009, 2011, 2016లో బెంగళూరు తుది పోరుకు అర్హత సాధించింది. అయితే, ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా కప్పు కొట్టలేదు.

# 14 ఏళ్ల ఐపీఎల్ స్టార్‌ను కలిసిన ప్రధాని మోదీ




**పాట్నా:** వైభవ్ సూర్యవంశీ .. ఐపీఎల్‌లో సెన్సేషన్ క్రియేట్ చేసిన విషయం తెలిసిందే. ఆ 14 ఏళ్ల కుర్రాడు.. ఈ యేటి ఐపీఎల్‌లో సెంచరీ చేశాడు. రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడిన ఆ టీనేజర్‌ను శుక్రవారం ప్రధాని మోదీ కలుసుకున్నారు. బీహార్ పర్యటనలో ఉన్న మోదీ.. పాట్నా విమానాశ్రయంలో వైభవ్‌ను మీట్ అయ్యారు. వైభవ్ పేరెంట్స్ కూడా మోదీని కలిశారు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సూర్యవంశి వీర ప్రతాపం చూపించి కేవలం 35 బంతుల్లో సెంచరీ కొట్టిన విషయం తెలిసిందే.

ప్రధాని మోదీని కలిసిన సమయంలో.. ఆయన పాదాలను తాకి ఆశీర్వాదం తీసుకున్నాడు వైభవ్. యంగ్ క్రికెటర్‌ను కలిసిన విషయాన్ని ప్రధాని మోదీ తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు. యువ సంచలన క్రికెటర్, అతని కుటుంబాన్ని పాట్నా ఎయిర్‌పోర్టులో కలుసుకున్నట్లు ఆ పోస్టులో రాశారు. వైభవ్ క్రికెట్ నైపుణ్యాన్ని యావత్ దేశం కీర్తిస్తున్నదని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని కోరుకుంటున్నట్లు మోదీ తెలిపారు.



ఐపీఎల్‌లో ఏడు మ్యాచ్‌లు ఆడిన వైభవ్ సూర్యవంశి మొత్తం 252 రన్స్ స్కోర్ చేశాడు. అయితే జైపూర్‌లో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌పై అతను చెలరేగిన తీరు అద్వితీయం. తన స్ట్రోక్ ప్లేతో యావత్ క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడతను.

# క్రేజీ ప్రాజెక్ట్ దక్కించుకున్న డ్రాగన్ బ్యూటీ 'కయాదు లోహార్'



టాకీస్: ఈ ఏడాది ఆరంభంలో 'డ్రాగన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ముద్దుగుమ్మ కయాదు లోహార్. ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటించిన డ్రాగన్ సినిమా సూపర్ హిట్‌గా నిలవడంతో కయాదు లోహార్ ఒక్కసారిగా స్టార్ హీరోయిన్‌గా మారింది. అంతకు ముందు తెలుగులో అల్లూరి అనే సినిమాలో నటించిన ఈ అమ్మడికి అంతగా గుర్తింపు దక్కలేదు. కానీ డ్రాగన్ సినిమాతో తెలుగులోనూ ఈమెకు మంచి పాపులారిటీ దక్కడం మాత్ర మే కాకుండా టాలీవుడ్ నుంచి పిలుపు అందింది అనే వార్తలు వస్తు న్నాయి. ఒకటి రెండు సిని మాలకు సంబంధిం చిన చర్చలు జరుగుతు న్నాయి. అతి త్వరలోనే ఆ తెలుగు సినిమాలు ఏంటి అనే విషయంలో క్లారిటీ వచ్చే అవకాశం ఉ ంది. ప్రస్తుతం తమిళ్‌లో రెండు మూడు సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు తాజాగా మలయాళ సినిమాలో ఛాన్స్ దక్కించు కుంది. మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నటిస్తున్న ఐయామ్ గేమ్ అనే సినిమాలో కయాదుకు ఛాన్స్ దక్కిందనే వార్తలు జోరుగా వస్తున్నాయి. మలయాళ సినిమా ఇండస్ట్రీ లోనే కాకుండా దుల్కర్ సల్మాన్‌కి అన్ని భాషల్లోనూ అభిమా నులు ఉన్నారు. ముఖ్యంగా టాలీవుడ్‌లో ఈయన చేసిన ప్రతి సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అందుకే దుల్కర్ సల్మాన్ మలయాళంలో సినిమా చేస్తూ ఉన్నా కూడా తెలుగు ప్రేక్షకుల్లో ఆసక్తి ఉంటుంది. అలాంటి క్రేజీ స్టార్ సిని మాలో కయాదు నటించడం వల్ల కచ్చితంగా మంచి ఫలితం ఉంటుంది. ప్రస్తుతం కయాదు చేస్తున్న సినిమాల్లో అన్నింటి కంటే దుల్కర్‌తో చేయబోతున్న సినిమా ఆమెకు స్టార్‌డం తెచ్చి పెడుతుంది అనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. డ్రాగన్ సినిమాతో వచ్చిన పాపులారిటీని సద్వినియోగం చేసుకుంటూ ఉన్న కయాదు లోహార్ తక్కువ సమయం లోనే పాపులర్ స్టార్స్ సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంటుంది. ముందు ముందు కూడా కయా దు లోహార్ సూపర్ హిట్ సినిమాల్లో నటించాలని అభిమా నులు కోరుకుంటున్నారు. ఐయామ్ గేమ్ సిని మాలో దుల్కర్ సల్మాన్ హీరోగా నటించడం మాత్రమే కాకుండా నిర్మాతగానూ వ్యవహరిస్తున్నాడు. దాంతో సినిమాపై ఆయనకు ఉన్న నమ్మకం ఏంటో అర్థం చేసుకోవచ్చు. 2021లో ముగిల్పేట అనే కన్నడ సినిమాలో నటించడం ద్వారా ఇండస్ట్రీకి పరిచయం అయిన కయాదు లోహార్ మొదటి సినిమాతో ఆశించిన స్థాయిలో గుర్తింపు దక్కించుకోలేక పోయింది. 2022లో ఈ అమ్మడు మలయాళంలో ఒక సినిమా, తెలుగులో ఒక సినిమా చేసిం ది. సౌత్‌లోనే కాకుండా ఈ అమ్మడు మరాఠి సినిమాలో కూడా నటించింది. ప్రస్తు తం తమిళ్, మళయాల సినిమాల్లో నటిస్తున్న ఈ అమ్మడు వచ్చే ఏడాదిలో తెలుగు ప్రేక్షకుల ముందుకు కూడా వచ్చే అవ కాశాలు ఉన్నాయి. త్వరలో ఈమె తమిళ్‌లో నటిస్తు న్న ఇదయం మురళి సినిమా ప్రేక్షకుల ముందుకు రాబో తుంది. ఆ సినిమా తర్వాత కయాదు మరింత బిజీ అవుతుందనే విశ్వాసంను చిత్ర యూనిట్ సభ్యులు వ్యక్తం చేస్తున్నారు.

# జార్జియాలో 'అఖండ 2'.. షూటింగ్

**టాకీస్:** నటసింహం నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్లో తెరకెక్కుతున్న సంచలన చిత్రం 'అఖండ 2' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమా కీలక షెడ్యూల్ కోసం చిత్ర బృందం జార్జియా చేరుకుంది. అక్కడ బాలయ్యపై భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. 'అఖండ' సృష్టించిన ప్రభంజనం తర్వాత, దాని సీక్వెల్ 'అఖండ 2'పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభమేళాలో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించిన చిత్ర యూనిట్, ఇప్పుడు జార్జియాలోని సుందరమైన ప్రదేశాలను ఎంచుకుంది.

బోయపాటి శ్రీను ఈ యాక్షన్ బ్లాక్‌లను అత్యంత భారీ ఎత్తున ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ షెడ్యూల్‌లో విదేశీ ఫైటర్స్ కూడా పాల్గొననున్నారని తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వీడియో కూడా ప్రస్తుతం వైరల్‌గా మారింది. మరోవైపు ఈ జార్జియా షెడ్యూల్‌లోనే బాలయ్య రెండో పాత్రకు సంబంధించిన ఒక భారీ ట్విస్ట్ కూడా రివీల్ అవుతుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.




14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్నారు. సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తుండగా, యంగ్ హీరో ఆది పినిశెట్టి విలన్ పాత్రలో కనిపించనున్నారు. బాలయ్య మరోసారి అఘోరి పాత్రలో ప్రేక్షకులను మెప్పించడానికి సిద్ధమవుతున్నారు.

గతంలో 'గౌతమిపుత్ర శాతకర్ణి' షూటింగ్ కూడా జార్జియాలో జరిగింది. ఇప్పుడు 'అఖండ 2' వంటి భారీ పాన్ ఇండియా చిత్రానికి కూడా అదే లొకేషన్ ఎంచుకోవడంతో, విజువల్స్ అద్భుతంగా ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఈ సినిమా 2025 సెప్టెంబర్ 25న దసరా కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



# ఒకే సినిమాకు రెండు రాష్ట్రాల్లో అవార్డులు ఇస్తే బాగోదు: మురళీమోహన్

**హైదరాబాద్:** ఏపీలోనూ సినీ అవార్డులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని ప్రముఖ సినీనటుడు మురళీమోహన్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అందించే గద్దర్ అవార్డుల ప్రకటన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఒకే తెలుగు సినిమాకు రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు అవార్డులు ఇవ్వడం బాగుండదన్నారు. దీనిపై రెండు ప్రభుత్వాలు ఒక అవగాహనకు రావాలని.. ఒక ఏడాది తెలంగాణ, మరో ఏడాది ఏపీ ప్రభుత్వాలు పురస్కారాలను ప్రకటించాలని సూచించారు. 'తెలంగాణలో ఈ సినిమాకు.. ఆంధ్రాలో ఆ సినిమాకు అవార్డు ఇచ్చారనేది వివాదానికి దారితీస్తుంది. తెలుగు సినిమాకు రెండు రాష్ట్రాలూ కావాలి. ఒక రాష్ట్రం ఎక్కువ.. మరో రాష్ట్రం తక్కువ కాదు. సినిమాకు సంబంధించి తెలుగు ప్రేక్షకులంతా ఒకటే. మన సినిమాలు ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శితమవుతున్నాయి. తెలుగు సినిమాలను మనకంటే ముందు అమెరికా వాళ్లు చూస్తున్నారు' అని మురళీమోహన్ అన్నారు.

# తప్పు చేస్తేనే క్షమాపణలు చెబుతాను..

## కన్నడ భాష వివాదంపై కమల్ హాసన్



**టాకీస్:** తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందంటూ ప్రముఖ నటుడు కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. కన్నడ భాషపై చేసిన వ్యాఖ్యలకు గానూ ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పాలనే డిమాండ్లు వెల్లువెత్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజా వివాదంపై కమల్ హాసన్ స్పందించారు. ఈ విషయంలో క్షమాపణలు చెప్పేందుకు ఆయన నిరాకరించారు. తప్పు చేసి ఉంటేనే క్షమాపణలు చెప్తానని స్పష్టం చేశారు. 'నేను తప్పు చేస్తే క్షమాపణలు చెప్తాను. లేదంటే చెప్పను. ఇది నా శైలి. ఈ విషయంలో ప్రజలు జోక్యం చేసుకోవద్దు' అంటూ చెప్పుకొచ్చారు. భారతదేశం ఒక ప్రజాస్వామ్య దేశం అని తాను చట్టం, న్యాయాన్ని నమ్ముతానని వ్యాఖ్యానించారు.

కమల్ హాసన్ నటించిన థగ్ లైఫ్ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం చెన్నైలో జరిగిన సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో కమల్‌హాసన్ మాట్లాడుతూ.. 'కన్నడం.. తమిళం నుంచి పుట్టింది' అని కామెంట్ చేశారు. ఇదే కార్యక్రమానికి కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ కూడా హాజరయ్యారు. ఆయన ఎదుటే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఉయిరే, ఉరవే తమిళే (నా ప్రాణం, నా బంధుత్వం తమిళం) అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన కమల్ హాసన్ అనంతరం కన్నడ స్టార్ శివరాజ్ కుమార్‌ని ఉద్దేశించి మాట్లాడారు.

'శివరాజ్‌కుమార్ వేరే రాష్ట్రంలో నివసిస్తున్నా నా కుటుంబ సభ్యుడు. అందుకే ఆయన ఈ రోజు ఇక్కడ ఉన్నారు. అందుకే నా ప్రసంగం మొదలుపెట్టేటప్పుడు.. నా జీవితం, నా కుటుంబం తమిళ భాష అని చెప్పా. మీ భాష (కన్నడ) తమిళ నుంచే పుట్టింది. ఆ విధంగా మీరు భాగస్వామి అయ్యారు' అని శివరాజ్‌కుమార్‌ను ఉద్దేశించి అన్నారు. అయితే తమిళం నుంచి కన్నడ పుట్టిందన్న కమల్ వ్యాఖ్యలపై కన్నడ సంఘాలు భగ్గుమన్నాయి. బెంగళూరులో థగ్‌లైఫ్ సినిమా బ్యానర్లను కొందరు ఆందోళనకారులు చించివేశారు. 'కర్ణాటకలో మీకు వ్యాపారం కావాలి.. కానీ కన్నడ భాషను అవమానిస్తారా?' అని ధ్వజమెత్తారు.

# గ్లామర్ డోస్ పెంచిన సామ్..

## సినిమాల విషయంలో మాత్రం సైలెన్స్



టాకీస్: సమంత కాంపౌండ్ నుంచి సినిమా అప్‌డేట్ వచ్చి చాలా రోజులవుతోంది. ప్రజెంట్ వెబ్ సిరీస్‌ల మీదే ఎక్కువగా ఫోకస్ చేస్తున్న ఈ భామ, నిర్మాతగా బిగ్ స్క్రీన్‌తో టచ్‌లో ఉన్నారు. అయితే లేటెస్ట్‌గా సమంత సైడ్ నుంచి ఎలాంటి అప్‌డేట్ లేకపోయినా... సోషల్ మీడియాలో మాత్రం ఈ బ్యూటీ పేరు తెగ ట్రెండ్ అవుతోంది. సినిమాలు చేయకపోయినా ఆడియన్స్‌తో మాత్రంలో టచ్‌లో ఉ ండేందుకు ట్రై చేస్తున్నారు సామ్. ఇన్నాళ్లు యాక్టింగ్ మీదే ఫోకస్ చేసిన ఈ బ్యూటీ ఇప్పుడు సోషల్ మీడియాలోనే యాక్టివ్‌గా ఉంటున్నారు. ఏదో ఒక పోస్ట్‌తో ట్రెండ్‌లో ఉండేందుకు ట్రై చేస్తున్నారు. ముఖ్యంగా గ్లామరస్ లుక్స్‌తో ఆన్ లైన్‌లో హీట్ పెంచేస్తున్నారు సామ్.రీసెంట్ టైమ్స్‌లో తను ప్రొడ్యూస్ చేసిన సినిమా ఈవెంట్స్‌తో పాటు కొన్ని రెడ్ కార్పెట్ ప్రోగ్రామ్స్‌లోనూ కనిపించారు సమంత. ఈ ఈవెంట్స్‌లో సామ్ లుక్స్ మీద చర్చ జరుగుతోంది. ముఖ్యంగా సామ్ స్టైలింగ్ సోషల్ మీడియాలో టాప్‌లో ట్రెండ్ అవుతోంది. డిజిటల్ ప్రజెన్స్ సంగతి పక్కన పెడితే సినిమాలు, పర్సనల్ లైఫ్ విషయంలో సమంత మౌనం దేనికి అన్నది మాత్రం ఎవరికీ అర్థం కావటం లేదు. ఆ మధ్య ఈ బ్యూటీ ప్రేమలో ఉన్నారన్న వార్తలు వైరల్ అయ్యాయి. ఆ న్యూస్ విషయంలో ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు సామ్. అదే సమయంలో తన నెక్స్ మూవీ విషయంలోనూ ఎలాంటి ఎనౌన్స్‌మెంట్ చేయలేదు. దీంతో సామ్ సైడ్ నుంచి క్లారిటీ కోసం ఎదురుచూస్తున్నారు అభిమానులు.

# శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్న సినీ నటుడు శ్రీకాంత్



**టాకీస్:** ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్ తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. వేకువజామున ఆలయానికి చేరుకున్న శ్రీకాంత్ కుటుంబానికి ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. ముందుగా వారు ఆలయానికి సమీపంలో ఉన్న రాఘవేంద్ర మఠంలో ప్రత్యేక పూజలు, హెూమం నిర్వహించారు. అనంతరం, శ్రీ సోమస్కంద మూర్తి సమేత జ్ఞాన ప్రసూనాంబికాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

దర్శనం అనంతరం, మృత్యుంజయ స్వామి సన్నిధిలో వేద పండితులు శ్రీకాంత్ కుటుంబానికి వేద ఆశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారులు స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు, ప్రసాదాలను కూడా బహూకరించారు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.